PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 149 | విజయవాడ, మంగళవారం 31 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 31 December 2024 | Rs



టీమిండియా బ్యాటర్ల వైఫల్యం

- బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆసీస్ గెలుపు
- 340 పరుగుల ఛేదనలో155కే భారత్ ఆలౌట్

6



పిఎస్ఎల్‌వి సి-60

ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

రెండు ఉపగ్రహాలు, 24 పేలోడ్లతో పిఎస్ఎల్‌వి సి-60' విజయవంతంగా నింగికెగిసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి బహుళ ప్రయోజనాల రాకెట్ సోమవారం రాత్రి 10 గంటల 15 సెకండ్లకు నింగిలోకి దూసుకెళ్లింది. ఒక్కొక్కటి 220 కిలోల బరువున్న స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ఉపగ్రహాలను భూమికి 476 కిలోమీటర్ల అంతరిక్ష కక్ష్యలోకి శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. మొదట స్పేడెక్స్-బి ఉపగ్రహం, అనంతరం మరో మూడు సెకండ్ల వ్యవధిలో స్పేడెక్స్-ఎ ఉపగ్రహం రాకెట్ నుంచి విడిపోయాయి. ఈ రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలూ విడిపోయిన తర్వాత 15 నిమిషాల 13 సెంకడ్లకు కక్ష్యను మార్చుకున్నాయి. సుదీర్ఘ సమయం అనంతరం రెండుసార్లు ఆర్బిట్ మార్పులో నాలుగో దశ అంటుకోవడం, మళ్లీ కట్ ఆఫ్, మళ్లీ స్టార్ట్, మళ్లీ కట్ ఆఫ్‌లతో నాలుగో దశలో భూమికి దగ్గరగా ప్రవేశించాయి ఈ తరుణంలో రాకెట్ శీర్ష భాగంలో అమర్చిన 24 పేలోడ్లు అక్కడక్కడా విసిరివేయబడ్డాయి. ఈ పేలోడ్లు భూమికి దగ్గర కక్ష్యలోకి చేరి రాకెట్ ప్రయోగం పూర్తి కావడానికి 95 నిమిషాలు సమయం పట్టింది. ఈ ప్రయోగంలో అత్యంత ముఖ్యమైన స్పేడెక్స్ ఉపగ్రహాలు కక్ష్యలో చేరిన వెంటనే ఈ ప్రయోగం విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు.


స్ట్రాపాన్ బూస్టర్లు లేని ప్రయోగం...

ఉపగ్రహాల బరువు తక్కువగా మిగతా 2లో

ప్రైవేటుకు హారతి

'గోదావరి-బనకచర్ల'లో సర్కారు కొత్త విధానం

- పదేళ్లపాటు నిర్వహణ కాంట్రాక్టు సంస్థలకే
- ఆదాయం తగ్గితే ప్రభుత్వం భర్తీ చేస్తుంది
- గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించిన చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుతల్లికి జలహారతిగా రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు ఆచరణలో ప్రైవేటు రంగానికి హారతిగా మారనుంది. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన వివరాల మేరకు ఈ ప్రాజెక్టును నిర్మించడంతో పాటు, పదేళ్లపాటు వారే నిర్వహించనున్నారు. ఆ తరువాతే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి రానుంది. హైబ్రిడ్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. హైబ్రిడ్ పద్ధతితోపాటు బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బిఒటి) విధానంలో రాష్ట్రంలో నిర్మించనున్న మొట్టమొదటి ప్రాజెక్టు ఇదే అవుతుంది. నిర్వహణ కోసం ప్రైవేటు సంస్థలు ఏ విధానాన్ని అవలంభిస్తాయన్న విషయాన్ని సిఎం స్పష్టత ఇవ్వలేదు. అయితే, లోటు ఏర్పడితే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పేరిట ప్రభుత్వమే భర్తీ చేస్తుంది అని ఆయన చెప్పారు. దీనికి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును మరో మూడు నెలల్లో తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలనూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పద్ధతిలో ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ ప్రాజెక్టుకు తెలుగుతల్లికి జలహారతి అని పేరుపెట్టినట్లు తెలిపారు. దాదాపుగా 80 వేల కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా మారుతుందని చెప్పారు.

ప్రైవేటుకు ఇలా...

పలువురు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సిఎం జవాబిస్తూ.. టెండర్ల పద్ధతిలో ప్రైవేటు కాంట్రాక్టర్లను ఆహ్వానించి ప్రాజెక్టును వారే నిర్మించి నిర్వహించేలా చూస్తామని చెప్పారు. మొత్తం ప్రాజెక్టును ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తారా లేక ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందా అన్న ప్రశ్నకు ప్రాజెక్టు ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, నిర్వహణ ప్రైవేటు వారు చేస్తారని చెప్పారు. వారు పెట్టిన ఖర్చుకు తగిన విధంగా ఏడాదికి కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని, దానిలో ఇంకా లోటు ఉంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. 'నీటిని ప్రజలకు అందించే బాధ్యత వారు చూస్తారు. దానికయ్యే ఖర్చు మనం చెల్లిస్తాం' అని చెప్పారు. 'జాతీయ రహదారుల నిర్మాణం ప్రైవేటు వ్యక్తులకు ఇస్తామని, అక్కడ వచ్చిన డబ్బులు తీసుకుని నిర్వహిస్తారని ఉదహరించారు. బనకచర్ల ప్రాజెక్టు ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టు కావడంతో మనం డబ్బులు ఇస్తామని, కాంట్రాక్టర్లు నిర్వహిస్తారని చెప్పారు. చెల్లింపుల కోసం సెస్ ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నించగా ప్రజలపై భారం వేయబోమని, ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ఇంత పెద్దమొత్తం ప్రభుత్వం ఎలా సమకూర్చుకుంటుందని మరో మీడియా ప్రతినిధి అడగగా కేంద్రం నుండి కొంత వస్తుందని, కొంత రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, అదే సమయంలో ప్రాజెక్టు వల్ల పంటలు పండితే రాష్ట్ర ఆదాయమూ పెరుగుతుందని, ఆ రూపంలో వచ్చే ఆదాయం ద్వారా కొంత చెల్లింపులు చేస్తామని అన్నారు.

ప్రాజెక్టు ఇలా....

ఒకటో సెగ్మెంట్లో (పోలవరం-ప్రకాశం బ్యారేజీ) రూ.13,511 కోట్లు, రెండో సెగ్మెంట్ (ప్రకాశం బ్యారేజీ నుండి బొల్లాపల్లి రిజర్వాయర్)కు రూ.28,560 కోట్లు, మూడో సెగ్మెంట్ (బొల్లాపల్లి నుండి బనకచర్ల)కు రూ.38,041 కోట్లు మొత్తం రూ.80,112 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. పోలవరం నుండి ప్రకాశం బ్యారేజీకి 38 వేల క్యూసెక్కులు, సాగర్, శ్రీశైలం ఇతర ప్రాంతాల నుండి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు 24 వేల మిగతా 2లో



ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్షాలు

కేంద్ర హోంమంత్రి పదవికి

అమిత్ షా అనర్హుడు

- పదవి నుంచి తొలగించాల్సిందే
- దేశవ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ రూపశిల్పి బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి పదవికి అమిత్ షా అనర్హుడని, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కించపరుస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయన బేషరతుగా పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యాన దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. పశ్చిమబెంగాల్, త్రిపుర, బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, హర్యానా, రాజస్థాన్, ఒడిశా, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, గోవా, పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీ, పుదుచ్చేరితోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు జరిగాయి. ఈ ఆందోళనల సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ.. అమిత్ షా వ్యాఖ్యలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా హిందుత్వ శక్తులు చేస్తున్న దాడిలో భాగమని పేర్కొన్నారు. అమిత్ షాకు రక్షణగా ప్రధాని నరేంద్ర మోడీ అనుసరిస్తున్న వైఖరి దారుణమన్నారు. ఎన్‌డిఎ పక్షాలు ఆలోచన చేయాలన్నారు. సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ (లిబరేషన్), ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఉమ్మడిగా ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, ఇతర వామపక్ష నేతలు సిద్ధేశ్వర్ శుక్లా, అమర్జీత్ కౌర్, సుచేతాడే, ఆర్‌ఎస్ దాగర్, ధర్మేంద్ర కుమార్ తదితరులు మాట్లాడారు. ఒడిశాలోని భువనేశ్వర్, కటక్, బెర్హంపూర్, జాజ్‌పూర్‌లో జరిగిన ఆందోళనల్లో వందలాది మంది పాల్గొన్నారు. హర్యానాలోని జిల్లా కేంద్రాల్లో నిరసనలు జరిగాయి. త్రిపురలో అగర్తల, బలోనియా, ఉదయ్‌పూర్, కమలాపూర్‌లలో భారీ నిరసన ర్యాలీలు జరిగాయి. పశ్చిమబెంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో వామపక్ష పార్టీలు రోడ్డును దిగ్బంధించాయి.

'గోటితో పోయేదాన్ని...'

- సంధ్య థియేటర్ సంఘటనపై పవన్‌కల్యాణ్ 6

జిమ్మి కార్టర్ ఇక లేరు

- శాంతి కోసం కృషి చేసిన నేత 5

అమిత్‌షా రాజీనామా చేయాలి

- రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరేంటి?
- వామపక్ష పార్టీల డిమాండ్ 3

కేంద్రంపై రైతుల ఆగ్రహం

- బంద్‌తో స్తంభించిన పంజాబ్
- 163 రైళ్లు రద్దు.. నిలిచిపోయిన రాకపోకలు



అమృత్‌సర్‌లో ఆందోళన చేస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల బంద్‌తో పంజాబ్ జనజీవనం స్తంభించింది. 163 రైళ్లు రద్దు కాగా, రాకపోకలు నిలిచిపోయాయి. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. రైతుల డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతు సంఘాలు సోమవారం పంజాబ్ బంద్ నిర్వహించాయి. అన్నదాతల డిమాండ్లను నెరవేర్చాలంటూ పంజాబ్ వ్యాప్తంగా కిసాన్ మజ్దూర్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చా బంద్ చేపట్టాయి. ఈ బంద్‌తో రాష్ట్రం మొత్తం స్తంభించిపోయింది. రైతులు పెద్దయెత్తున రోడ్లపైకి వచ్చి బంద్‌లో పాల్గొన్నారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. రోడ్డు, రైలు మార్గాలను దిగ్బంధించారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్, భటిండాలోని రాంపురా ఫుల్, మొహాలీలోని ఐఐఎస్‌ఇఆర్ చౌక్ వద్ద ఎయిర్‌పోర్ట్ రోడ్డు, కురాలి రోడ్ టోల్ ప్లాజా, లాల్రూ సమీపంలోని అంబాలా - ఢిల్లీ హైవే, ఖరార్-మొరిండా హైవే సహా కీలక మార్గాలను రైతులు దిగ్బంధించారు. రైతులు ధరేరి జట్టన్ టోల్ ప్లాజా వద్ద బైఠాయించారు. దీంతో పాటియాలా-చండీగఢ్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి.

రైతులు చేపట్టిన ఈ బంద్‌కు వాణిజ్య సంస్థలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు స్వచ్ఛందంగా మద్దతునిచ్చాయి. పంజాబ్ అంతటా ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మూతపడ్డాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200కు పైగా రోడ్లను రైతులు బ్లాక్ చేశారు. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రైతుల బంద్ రైళ్ల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ-పంజాబ్ మధ్య రాకపోకలు సాగించే దాదాపు 163 రైల్వే సర్వీసులు రద్దయ్యాయి. విమానాలు, వైద్య, అంబులెన్స్‌లు, పెళ్లి, ఉద్యోగ ఇంటర్వ్యూ సహా అత్యవసర సేవలను బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఉదయం మిగతా 5లో

రిలయన్స్‌కు 5 లక్షల ఎకరాలు

- ఎస్ఐపిబిలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రిలయన్స్ ఇండస్ట్రీకి ఐదు లక్షల ఎకరాలు కేటాయించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబి) ఆమోదించింది. దీనిలో రూ.65 వేలకోట్ల పెట్టుబడితో 11 వేల టన్నుల సామర్థ్యంతో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. సోమవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో ఎస్ఐపిబి సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది. మొత్తం తొమ్మిది ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా రూ.1,82,166 కోట్ల పెట్టుబడులు రావడంతోపాటు, 2,63,411 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని సిఎం దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) నెల్లూరు జిల్లా రామాయపట్నంలో ఆరు వేల ఎకరాల్లో రూ.96,862 కోట్లతో భారీ రిఫైనరీని ఏర్పాటు చేయనుంది. దీనివల్ల 2,400 మందికి ఉపాధి దొరుకుతుందని లెక్కలేశారు. తొమ్మిది మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రో కెమికల్స్ యూనిట్లు, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మిస్తారని అధికారులు వివరించారు. వచ్చే 20 ఏళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ.88,747 కోట్ల ఆదాయం రానుంది. 2029లోగా ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. విశాఖపట్నం మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టిసిఎస్) రూ.80 కోట్ల పెట్టుబడి పెట్టనుందని, దీనివల్ల రెండువేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. శ్రీసత్యసాయి జిల్లా గుడిపల్లిలో అజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ 70.71 ఎకరాల్లో ఎలక్ట్రిక్ త్రీవీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.1,046 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 106 ఎకరాల్లో రూ.1,174 కోట్లతో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఎండిఎఫ్ వర్టికల్ బోర్డ్ ప్లాంటు తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఇవి కాకుండా నూతనంగా తీసుకొచ్చిన క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ఐదు సంస్థలు రూ.83 వేల కోట్ల పెట్టుబడితో వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఎఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కాకినాడలో 592 ఎకరాల్లో రూ.12 వేలకోట్లు పెట్టుబడితో గ్రిడ్ హైడ్రోజన్ ఆధారిత అమ్మోనియా తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తోంది. అలాగే జాన్ కొకిరిల్ ప్రాజెక్టు రూ.2 వేలకోట్లతో 40 ఎకరాల్లో రెండు గిగావాట్ల సామర్థ్యం కలిగిన మిగతా 5లో

అత్యంత సంపన్న సిఎం చంద్రబాబు

న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్ చంద్రబాబు నాయుడు నిలిచారు. ఆయన ఆస్తుల విలువ రూ. 931 కోట్లు. ఈ వివరాలను అసోసియేషన్ ఫర్ డెమెక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సోమవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. అలాగే దేశంలో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రుల సగటు ఆస్తి రూ. 52.59 కోట్లుగా నివేదిక పేర్కొంది. దేశంలో మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల మొత్తం ఆస్తుల విలువ రూ. 1,630 కోట్లుగా నివేదిక తెలిపింది. అలాగే దేశంలో 2023-24లో తలసరి నికర జాతీయ ఆదాయం (ఎన్ఎన్ఐ) రూ.1,85,854 కాగా, ఇదే ఏడాదిలో ముఖ్యమంత్రుల సగటు ఆదాయం రూ. 13,64,310గా నివేదిక పేర్కొంది. ఇది ఎన్ఎన్ఐ కంటే 7.3 రెట్లు ఎక్కువ అని తెలిపింది. ధనిక ముఖ్యమంత్రుల్లో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పెమా ఖండూ రూ.332 కోట్లతో రెండోస్థానంలో ఉన్నారని నివేదిక తెలిపింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సుమారు రూ. 51 కోట్లతో మూడోస్థానంలో ఉన్నారు. అలాగే 13 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని. వీరిలో 10 మందిపై హత్యాయత్నం, కిడ్నాప్, లంచం, క్రిమినల్ బెదిరింపులు వంటి తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది.

సిఐడిలో యాన్యువల్ రోలింగ్ అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఐడిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిఐలు అవార్డులు అందుకున్నారు. అడిషనల్ డిజిపి రవి శంకర్ ఆదేశాల మేరకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం సిఐడి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. బెస్ట్ ఇన్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విశాఖపట్నం రీజనల్ ఆఫీసు సిఐ ఎమ్ శేషు, బెస్ట్ ఇన్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ నుంచి ఇన్‌స్పెక్టర్ కె పైడపునాయుడు, బెస్ట్ ఇన్ జనరల్ అఫెన్సెస్ వింగ్‌లో కర్నూలు రీజనల్ ఆఫీసులో పనిచేస్తున్న సిఐ పి ప్రసాదరావు, సిఐడి హెడ్ ఆఫీస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న డి రాంబాబు బెస్ట్ ఇన్ సైబర్‌క్రైమ్‌లో అవార్డులు అందుకున్నారు. వీరితో పాటు నెల్లూరు రీజనల్ ఆఫీసులో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె బాలకోటయ్యకు బెస్ట్ ఇన్ కోర్టు క్రాఫ్ట్ విభాగం నందు, సిఐడి హెడ్ ఆఫీసు ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సిహెచ్ క్రిస్టోఫర్‌కు బెస్ట్ ఇన్ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కింద అవార్డు అందుకున్నారు. సిఐడి హెడ్ ఆఫీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వి ప్రతాప్‌కుమార్‌కు బెస్ట్ ఇన్ ఎన్‌సిఆర్‌బి వింగ్‌లో, విశాఖపట్నం రీజనల్ ఆఫీసులో అడిషనల్ ఎస్‌పిగా పనిచేస్తున్న ప్రేమ్‌కాజల్ యాన్యువల్ రోలింగ్ అవార్డులు అందుకున్నారు. వీరందరికీ షీల్డు, నగదు, ప్రశంసా పత్రాలు సిఐడి ఉన్నతాధికారులు అందజేశారు.

విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించిన ఆర్ఐ, విఆర్ఒల సస్పెన్షన్

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

రెవెన్యూ అధికారులపై బాపట్ల కలెక్టర్ వెంకటమురళి సోమవారం నాడు చర్యలు తీసుకున్నారు. చీరాల మండలం ఈపురుపాలెంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన రెండు గ్రూపుల మధ్య గొడవలో ఓ గ్రూపునకు చెందిన వారు ప్రొక్లయిన్‌ను మూడు రోజుల క్రితం తగలబెట్టారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాల విషయం ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడం పట్ల రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చీరాల తహశీల్దార్ కె.గోపికృష్ణకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. చీరాల ఆర్ఐ కె.నాగకుమార్, అదే మండలం తోటవారిపాలెం విఆర్ఒ ఎస్.శివరామిరెడ్డి, బోయినవారిపాలెం విఆర్ఒ పి.తులసీరావులను సస్పెండ్ చేశారు.

మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో గౌతమ్‌తేజ్ అరెస్ట్

- కోర్టులో హాజరు-14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి- పలమనేరు (చిత్తూరు జిల్లా)



అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో జూనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో సిఐడి అధికారులు అరెస్ట్ చేసి చిత్తూరు కోర్టులో సోమవారం హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ కేసులో మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాష, పాత ఆర్‌డిఒలు మురళి, హరిప్రసాద్, రైస్‌మిల్ యజమాని మాధవరెడ్డి, విఆర్ఎ వెంకటరమణ, తదితరులు నిందితులుగా ఉన్నారు. వారంతా ముందస్తు బెయిలు పొందినట్లు సమాచారం.

బిసిలకు ప్రాధాన్యత

- మంత్రులు అచ్చెన్న, సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ నియామకం... కూటమి ప్రభుత్వం బిసిలకు ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని, దాడులు జరిగాయని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. టిటిడి ఇఒగా బిసినే ప్రభుత్వం నియమించిందని, భవిష్యత్తులో బిసిలకు మేలు చేకూర్చే మరిన్ని పథకాలు ప్రవేశపెట్టబోతుందని పేర్కొన్నారు. బిసిల పట్ల సిఎం చంద్రబాబు తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. నూతన సిఎస్‌గా బిసి అయిన విజయానంద్‌ను నియమించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారి బిసి అధికారి సిఎస్‌గా నియమితులవడం గర్వించదగ్గ విషయమన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతకు కృషి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత కోసం సిపిఐ కృషి చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. అంబేద్కర్ అందించిన ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యాంగానికి ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతకు ఆవశ్యకత ఏర్పడిందన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో పాల్గొనని కారణంగానే బిజెపికి గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, భారత రాజ్యాంగమన్నా గౌరవం లేదన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. శతవార్షికోత్సవాల్లో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం, చరిత్ర, పార్టీ సాధించిన విజయాలను ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రూపొందించిన ఆడియో సిడిని రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల ద్వారా బిజెపిని తిప్పికొట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు
- 20 అంశాలపై కర్నూలు జిల్లా మహాసభ తీర్మానం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి



మహాసభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పక్కన నాయకులు

బలమైన ప్రజా ఉద్యమాల ద్వారా బిజెపిని దెబ్బకొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జమిలి ఎన్నికలు వస్తే రాజ్యాంగ పరిరక్షణ ఉండదన్నారు. సిపిఎం కర్నూలు జిల్లా మహాసభ రెండోరోజు సోమవారం ఎమ్మిగనూరులోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లోని కామ్రేడ్ రాజేశ్వర్ రెడ్డి, సోమన్న ప్రాంగణంలో కొనసాగింది. తొలుత పార్టీ జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపానికి ప్రతినిధులు నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలకు టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమైందని, వాటిని తిప్పికొట్టాలని కోరారు. గతంలో విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టిన చరిత్ర సిపిఎంకు ఉందని తెలిపారు. సిపిఎం యువ నాయకులు జి.రామన్న మాట్లాడుతూ.. దేశం అప్రకటిత ఎమర్జెన్సీ ఎదుర్కొంటోందన్నారు. యువతను మతం మత్తులోకి, మూఢనమ్మకాల్లోకి బిజెపి నెడుతోందని వివరించారు. మొత్తం 20 తీర్మానాలను మహాసభ ఆమోదం తెలిపింది. జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వారిని క్రమబద్ధీకరించాలని, వలసలను నివారించాలని, మహిళలపై దాడులను అరికట్టాలని, అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి భద్రత కల్పించాలని, పలు అంశాలపై మహాసభ తీర్మానించింది. అధ్యక్షవర్గంగా పి.నిర్మల, టి.రాముడు, లక్ష్మన్న వ్యవహరించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు.

జిల్లా కార్యదర్శిగా గౌస్ దేశాయ్



సిపిఎం కర్నూలు జిల్లా కమిటీ సభ్యులుగా 26 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా డి.గౌస్ దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యులుగా పి.నిర్మల, జి.రామకృష్ణ, కె.వెంకటేశ్వర్లు, కెవి నారాయణ, ఎండి అంజిబాబు, ఎండి ఆనంద్‌బాబు, టి.రాముడు ఎన్నికయ్యారు.

కేంద్ర మంత్రిగా అమిత్ షా అనర్హుడు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి



రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను గౌరవించలేని అమిత్ షా కేంద్ర హోం మంత్రిగా అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా మహాసభ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు బిజెపిలోని ఎవరికీ రాజ్యాంగం పట్ల, అంబేద్కర్ పట్ల గౌరవం లేదని, వారికి మనుధర్మ శాస్త్రం పైనే నమ్మకం ఉందన్నారు. బిజెపి వల్ల రాజ్యాంగానికి నష్టం వాటిల్లుతోందని, దీని ద్వారా రిజర్వేషన్లు, రాష్ట్రాల హక్కులకు, సెక్యూలరిజం, సమానత్వానికి నష్టం కలిగే పరిణామాలు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు జిల్లా మాత్రమేనని, తుంగభద్ర నదీ జలాలు సముద్రం పాలవుతున్నా, ఈ జిల్లాలో అనేక వేల ఎకరాలకు సాగునీరు అందించలేకపోతున్నారన్నారు. వందలాది గ్రామాల ప్రజలు ఆరు నెలల పాటు గ్రామాల్లో ఉంటే మరో ఆరు నెలలు బతుకుబాట కోసం వలస వెళ్తున్నారని తెలిపారు.



విజయానంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జెన్‌కో ఎండి చక్రధర్ బాబు, సిపిడిసిఎల్ సిఎండి పటాన్‌శెట్టి రవి, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి, డైరెక్టర్ ఎకెవి భాస్కర్

విజయానంద్‌కు అభినందనలు వెల్లువ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయానంద్‌ను ఆయన నివాసంలో జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ఎపి సిపిడిసిఎల్ సిఎండి పటాన్‌శెట్టి రవి, ట్రాన్స్‌కో జెఎండి(హెచ్‌ఆర్) కీర్తి చేకూరి, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఎకెవి భాస్కర్ కలిసి అభినందనలు తెలిపారు. సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండి కమలాకర్ బాబు, జెన్‌కో డైరెక్టర్లు అశోక్ కుమార్ రెడ్డి, నవీన్ గౌతమ్, ఎపి విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు తదితరులు విజయవాడలోని విద్యుత్ సౌధలో కలిసి అభినందనలు తెలిపారు. అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పి దామోదర్ కూడా విజయానంద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయానంద్‌ను కలిసేందుకు ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు, సిబ్బంది తాకిడితో జెన్‌కో కార్యాలయం సోమవారం సాయంత్రం కిక్కిరిసిపోయింది.

అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ కొట్టివేయండి

- నాంపల్లి కోర్టులో పిపి వాదనలు... జనవరి 3న తీర్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నిందితుడిగా ఉన్న నటుడు అల్లు అర్జున్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. బెయిల్ పిటిషన్‌పై పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. అల్లు అర్జున్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ కొట్టివేయాలని పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌పై తీర్పును జనవరి 3వ తేదీకి వాయిదా వేశారు.

మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

- తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి- హైదరాబాద్

దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆయనకు నివాళులర్పించేందుకు రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. సిఎం రేవంత్‌తోపాటు మంత్రులు, శాసనసభ్యులు ఈ సందర్భంగా మన్మోహన్‌కు ఘన నివాళులర్పించారు. దేశానికి మన్మోహన్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆయనకు భారత రత్న ఇవ్వాలని తీర్మానిస్తున్నామని తెలిపారు. మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో సభ్యుల సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సిఎం ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

పోలీసు పహారా నడుమ కారిడార్ పనులు

- సిపిఎం నాయకులు అప్పలరాజు హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి)



జెసిబితో చెట్లను తొలగిస్తున్న దృశ్యం



ధర్మవరంలో అప్పలరాజును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో వైజాగ్-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం మౌలిక సదుపాయాల కల్పన పనులను పోలీసుల పహారా నడుమ ఎపిఐఐసి, రెవెన్యూ అధికారులు సోమవారం చేపట్టారు. సర్వే నెంబర్ 292లోని 244 ఎకరాల్లో రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. అక్కడ ఉన్న కొబ్బరి చెట్లను జెసిబిలతో తొలగింపజేశారు. పనులను తహశీల్దార్ నరసింహమూర్తి, ఆర్ఐ కన్నబాబు, ఎపిఐఐసి అధికారులు పర్యవేక్షించారు. ఈ పనులను స్థానికులు అడ్డగిస్తారన్న ఉద్దేశంతో ఆ ప్రాంతంలో సుమారు 30 మంది పోలీసులను మోహరింపజేశారు. సిఐలు కుమారస్వామి, రామకృష్ణ, అప్పన్న, రేవతమ్మ, పలువురు ఎస్ఐల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాజయ్యపేట, బుచ్చిరాజుపేటలో కారిడార్ పనులను స్థానికులు గతంలో అడ్డుకున్నారు. రాజయ్యపేటలో ఆదివారం హోం మంత్రి అనిత పర్యటనలో మత్స్యకార యువకులు బల్క్ డ్రగ్స్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. అయినా, ప్రభుత్వం పనులను ప్రారంభించింది.

అసలేం జరిగింది?

వైజాగ్-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట మండలంలోని రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, వేంపాడు రెవెన్యూ పరిధిలో పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం భూ సేకరణకు 2010లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఎపిఐఐసి ద్వారా భూ సేకరణ ప్రక్రియ చేపట్టగా, అప్పట్లో స్థానికులు బలవంతపు భూసేకరణను అడ్డుకున్నారు. ఈ సేకరణకు వ్యతిరేకంగా పోరాడారు. అయినా, ప్రభుత్వం లెక్క చేయకుండా బలవంతంగా భూ సేకరణ ప్రక్రియ కొనసాగించింది. ఎపిఐఐసి సుమారు 5,500 ఎకరాలను సేకరించింది. జిరాయితీ భూములకు రూ.18 లక్షలు, డి-పట్టా భూములకు రూ.12 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నట్లు ప్రకటించింది. అయితే, డి-పట్టాలకు, సాగు భూములకు, అక్కడక్కడా జిరాయితీ భూములకు, చెట్లకు, ఇళ్లకు పరిహారం నేటికీ చెల్లించలేదు. ఇళ్లకు పరిహారం తక్కువగా చెల్లించారు. దీంతో, సంబంధిత రైతులు, నిర్వాసితులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూ సేకరణలో భాగంగా తమ్మయ్యపేట, తుమ్మలపేట, చందనాడ కాలనీ, మూలపర్ర గ్రామాల్లో ఇళ్లను తొలగించాల్సి ఉంది. వీరందరికీ పునరావాసం కల్పించాల్సి ఉంది.

పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించకుండా పనులా?

అనకాపల్లిలో జనవరి 8న ప్రధాని మోడీ ఫార్మా సెజ్‌కు శంకుస్థాపన చేస్తారని ఎంపి సిఎం రమేష్ ప్రకటించడంతో స్థానిక నిర్వాసితుల్లో ఆందోళన మొదలైంది. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు హౌస్ అరెస్టు చేసిన ఎం.అప్పలరాజు మీడియాతో మాట్లాడుతూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ, సాగు భూములకు పరిహారం, చెల్లించాలని, బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేశారు. నిర్బంధం, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

అరెస్టును నిరసిస్తూ ఆందోళన

అప్పలరాజు హౌస్ అరెస్టును ఖండిస్తూ అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏ కార్యక్రమాలు చేపట్టినా ముందుగా ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం నాయకులను అక్రమంగా నిర్బంధించడం సరైనది కాదన్నారు. అరెస్టులు, నిర్బంధాలు అప్రజాస్వామికమని అధికారంలోకి రాకముందు రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత నినదించారని, నేడు సిపిఎం నేతలపై నిర్బంధం ప్రయోగించడం అప్రజాస్వామికం కాదా? అని ప్రశ్నించారు.

రైతుల్లో మనోధైర్యం కల్పించండి

- వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ బి.రాజశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాతావరణ మార్పుల కారణంగా తరచూ ఏర్పడుతున్న తుఫాన్లు, అధిక వర్షాల వల్ల రైతులు మనోధైర్యం కోల్పోకుండా వారిలో భరోసాను, మానసిక ధైర్యం పెంచే తోడ్పాటును అందించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బ్యాంకర్లకు, వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రుణాలు పొంది సకాలంలో చెల్లిస్తున్న వారికి వడ్డీ లేని రుణాలు, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తున్న విషయంపై రైతుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శక సూత్రాలను అనుసరించి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల నుంచి రైతులకు ఎటువంటి హామీ, పూచీకత్తు లేకుండా ఇచ్చే రుణాన్ని రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ పెంచినట్లు చెప్పారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. బ్యాంకర్ల రాష్ట్ర కన్వీనర్ సి.భాస్కరరావు మాట్లాడుతూ... రైతులకు పూర్తి మానవీయ కోణంలో సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు పద్మావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్లు, వివిధ బ్యాంక్‌ల రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పిఎస్‌ఎల్‌వి సి-60 ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)



మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్, మిషన్ డైరెక్టర్ జయకుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్ర

ఉన్న కారణంగా పిఎస్‌ఎల్‌వి సి-60 స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా రూపొందించారు. ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 229 టన్నుల బరువు కలిగిన నాలుగు దశల పిఎస్‌ఎల్‌వి రాకెట్... రెండు, నాలుగవ దశలు ద్రవ ఇంధనంతోనూ, ఒకటి, మూడవ దశల్లో ఘన ఇంధనంతో నడిచాయి. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది 62వ రాకెట్. ఈ సిరీస్‌లో ఇప్పటికే ఎన్నో ప్రయోగాలు జరిగినప్పటికీ ఏదో ఒక కొత్తదనాన్ని ప్రతిసారీ శాస్త్రవేత్తలు ఆవిష్కరిస్తూనే ఉన్నారు. ఈసారి స్పేడెక్స్ ఉపగ్రహాలతో అంతరిక్షంలో సరికొత్త విన్యాసాలకు నాంది పలికారు. రెండు ఆర్బిట్లలో ప్రవేశించే ఉపగ్రహాలు క్రమేణ దగ్గరై ఒకచోట అనుసంధానమయ్యే ప్రక్రియ ఇస్రోకు కొత్త. ఈ విధంగా అంతరిక్షంలోకి చేరిన ఉపగ్రహాలు ఒక్కచోట చేరితే భవిష్యత్తులో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. అంతరిక్షంలో ఇస్రో స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్న తర్వాత మన ప్రయోజనాల కోసం ఉపయోగించే ఉపగ్రహాలన్నీ ఒక సమూహంగా చేరి విలువైన సమాచారం సేకరించి భూమికి అందిస్తాయి. ఈ స్పెడెక్స్ ఉపగ్రహాల తయారీలో ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమర్చారు. బెంగళూరు యుఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈ రెండు ఉపగ్రహాలనూ రూపొందించారు. పిఎస్‌ఎల్‌వి రాకెట్ ప్రయోగం విజయంపై ఇస్రో ఛైర్మన్ సోమనాథ్, మిషన్ డైరెక్టర్ జయకుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్ర హర్షం వ్యక్తం చేశారు.

మార్చి నాటికి 3 శాతం జిఎన్‌పిఎలు : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ ముగింపు నాటికి భారత బ్యాంక్‌ల స్థూల నిరర్ధక ఆస్తులు 2.6 శాతంగా ఉన్నాయని ఆర్‌బిఐ తన ఫైనాన్సియల్ స్టెబిలిటీ రిపోర్ట్‌లో వెల్లడించింది. 2026 మార్చి ముగింపు నాటికి 3 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది. ప్రజల అధిక అప్పులు, దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ వైరుధ్యాలు ఆర్థిక స్థిరత్వానికి ప్రమాదాలను కలిగించొచ్చని విశ్లేషించింది. సోమవారం ఆర్‌బిఐ విడుదల చేసిన ఈ రిపోర్ట్‌లో.. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జిఎన్‌పిఎ 2.6 శాతానికి తగ్గి 12 ఏళ్ల కనిష్ఠ స్థాయి వద్ద నమోదయ్యింది. నికర నిరర్ధక ఆస్తులు 0.6 శాతానికి పరిమితమయ్యాయి.ఆర్‌టిజిఎస్, నెఫ్ట్ చెల్లింపుల విషయంలోనూ పొరబాట్లకు ఆస్కారం లేకుండా ఇకపై ఆయా చెల్లింపుల వ్యవస్థల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు అవతలి వ్యక్తి పేరు కనిపించనుందని ఆర్‌బిఐ తెలిపింది. ఈ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు (ఎన్‌పిసిఐ)కి సూచించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1కల్లా దీన్ని అందుబాటులోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది. ప్రస్తుతం యుపిఐ చెల్లింపుల్లో ఈ సదుపాయం ఉంది.

సిసి టివి ఫుటేజీ అడిగితే కుంటిసాకులా?

- పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

పౌరుల అక్రమ నిర్బంధంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయా పోలీస్ స్టేషన్లలోని సిసి ఫుటేజీ ఇవ్వాలని కోరినప్పుడల్లా ఏదో ఒక సాకు చెబుతున్నారని పోలీసులపై మండిపడింది. కుంటిసాకులు చెప్పడాన్ని తప్పుపట్టింది. సిసి టివి కాలిపోయిందంటూ పల్నాడు జిల్లా, మాచవరం పోలీస్ స్టేషన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ అఫిడవిట్ దాఖలు చేయడంపై నిప్పులు చెరిగింది. ఎస్‌హెచ్‌ఒపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే పరిస్థితులు దారికి వస్తాయని హెచ్చరించింది. ఎస్‌హెచ్‌ఒను సుమోటోగా ప్రతివాదిగా చేర్చి, కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమిస్తామని కూడా హెచ్చరించింది. దీనిపై పోలీసుల వైఖరి చెప్పాలని ఆదేశించింది. విచారణను జనవరి 7కు వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్ రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. తన సోదరుడు కటారి గోపిరాజును పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ కె నాగరాజు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. మాచవరం పిఎస్‌లో నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు సిసి టివి ఫుటేజీ సమర్పించేలా పోలీసులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ మేరకు గతంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యుపిఎస్‌సి సహా సిసి ఫుటేజీ కాలిపోయిందంటూ మాచవరం ఎస్‌హెచ్‌ఒ కౌంటర్ వేయడంతో దానిని సోమవారం పరిశీలించిన హైకోర్టు తీవ్రస్థాయిలో తప్పుపట్టింది. సిసి కెమెరాలు పనిచేయడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎస్‌హెచ్‌ఒ చేతులు దుపులుకున్నారని ఆక్షేపించింది.

గుంటూరు ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి ముందస్తు బెయిల్ కేసు విచారణ వాయిదా

ఎంపిగా ఉండగా తనను పోలీసులు కొట్టిన కేసులో గాయాలు లేవంటూ డిప్యూటీ స్పీకర్ కె రఘురామ కృష్ణరాజు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ గుంటూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ నీలం ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. గుంటూరు, నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలనే వ్యాజ్యంలో తనను ప్రతివాదిగా పరిగణించాలన్న రఘురామరాజు అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది.

మంత్రి నిమ్మల పిటిషన్‌పై ప్రతివాదులకు నోటీసులు

తనపై ఉన్న ఎస్‌సి, ఎస్‌టి కేసును కొట్టేయాలంటూ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వేసిన పిటిషన్‌పై విచారణ జనవరి 7కు వాయిదా పడింది. ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టులోని ప్రొసీడింగ్స్ రద్దు చేయాలని నిమ్మల పిటిషన్ వేశారు. రామానాయుడుపై ఫిర్యాదు చేసిన పాలకొల్లు టౌన్ వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు బండి రమేష్‌కు సోమవారం న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి నోటీసులు జారీ చేశారు.

ఆడిటింగ్ సంస్థపై కేసు వివరాలివ్వండి : హైకోర్టు

కాకినాడ డీప్ వాటర్ పోర్టు (కెడిడబ్ల్యుపి) వాటాల బదిలీ వ్యవహారంలో ప్రముఖ ఆడిటింగ్ సంస్థ పికెఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం కంపెనీపై నమోదు చేసిన కేసు వివరాలివ్వాలని సిఐడికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జనవరి రెండుకు విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు. సిఐడి తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ పికెఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం హైకోర్టును ఆశ్రయించింది. పిటిషనర్ కంపెనీకి అంతర్జాతీయంగా మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదించారు. వృత్తిపరమైన నివేదిక ఇస్తే వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్లుగా కేసు నమోదు చేయడం చెల్లదన్నారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ ప్రతివాదన చేస్తూ, విజిలెన్స్ నివేదిక ఆధారంగా పిటిషనర్ సంస్థపై కేసు నమోదు అయ్యిందన్నారు. గడువు ఇస్తే కౌంటర్ వేస్తామని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు.

సిసి టివి ఫుటేజీ తెప్పిస్తే.. గుట్టురట్టు ఖాయం

సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆయన భార్య కల్యాణి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సిసి టివి ఫుటేజీలను పరిశీలిస్తే అక్రమ నిర్బంధం గురించి తెలుస్తుందని సీనియర్ న్యాయవాది టి నిరంజన్‌రెడ్డి చెప్పారు. నవంబర్ 8న నిర్బంధంలోకి తీసుకున్న పోలీసులు హైకోర్టుకు మాత్రం 10వ తేదీన అరెస్టు చేసినట్లు చెబుతున్నారని చెప్పారు. దీనిపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం నిమిత్తం విచారణ జనవరి 7కు వాయిదా పడింది.

సజ్జల భార్గవ్‌రెడ్డిపై చర్యలొద్దు

సోషల్ మీడియా పోస్టులకు చెందిన కేసుల్లో వైసిపి సోషల్ మీడియా గత ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌రెడ్డిపై జనవరి 7 వరకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గతంలోని ఉత్తర్వులను సోమవారం పొడిగిస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదేశాలు జారీ చేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి : వైవి విక్రాంత్‌రెడ్డి

కాకినాడ డీప్ సి వాటర్ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో కర్నాటి వెంకటేశ్వరరావు (కెవి రావు) రాజకీయ దురుద్దేశాలతోనే తనపై సిఐడికి ఫిర్యాదు చేశారని వైవి సుబ్బారెడ్డి కుమారుడు వైవి విక్రాంత్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన రిప్లై కౌంటర్ అఫిడవిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు. బెదిరింపు, బలవంతం వంటి చర్యలకు పాల్పడలేదని, వాటాల బదిలీలు చట్ట ప్రకారమే జరిగాయని చెప్పారు. ప్రతిష్టను దెబ్బతియ్యాలన్న ఎజెండాతోనే కెవి రావు తనపై నిరాధార, తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ప్రాథమిక ఆధారాలను చూపకుండా ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో తన వాదనను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ జరపనుంది.

ప్రైవేటుకు హారతి

(మొదటి పేజీ తరువాయి)

క్యూసెక్కులు, బొల్లాపల్లి నుండి బనకచర్లకు 24 వేల క్యూసెక్కులు నీటిని పంప్ చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పది లిఫ్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు చోట్ల టన్నెల్స్ తవ్వాలని, వీటి మొత్తం దూరం 38.01 కిలోమీటర్లు ఉంటుందని పేర్కొన్నారు. 16.7 కిలోమీటర్లు పైపులైను ద్వారా మళ్లిస్తామని చెప్పారు. ప్రాజెక్టు కోసం 47,999 ఎకరాలు సేకరించాలని, అటవీ భూమి 17 వేల ఎకరాలు ఉందని తెలిపారు. బొల్లాపల్లి రిజర్వాయర్ పరిధిలో 15 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రాయలసీమ హార్టికల్చర్, కోస్తా ఆక్వాకల్చర్ హబ్‌గా తయారవుతాయని అన్నారు. వీటితోపాటు విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలు తీరుతాయని, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయమూ వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టు కావడంతో పక్క రాష్ట్రాల నుండి కూడా ఇబ్బంది ఉండదని తెలిపారు. మూడేళ్లలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేలా చూస్తామని చెప్పారు.

అత్యధిక ప్రాజెక్టులు టిడిపి హయాంలోనే...

రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల్లో అత్యధికం తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎన్‌టిఆర్ ప్రారంభించారని, అదే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తి చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు మాత్రం రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారని వివరించారు. దాన్ని కూడా టిడిపి ప్రభుత్వమే పూర్తి చేస్తుందని చెప్పారు. నీటివనరులు పెరగడం ద్వారా పంటలు పండి ఆదాయం పెరిగితే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నుండి సముద్రంలోకి పోతున్న 3000 టిఎంసిలో పదిశాతం అంటే 300 టిఎంసిల నీటిని మాత్రమే మనం మళ్లించుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. తాటిపూడి లిఫ్టు కాలువ 108 కిలోమీటర్లు దూరం పోలవరం కుడికాలువకు సమాంతరంగా పొడిగించి కృష్ణా నదిలో కలుపుతామని అన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

- రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరేంటి?
- వామపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి- యంత్రాంగం

రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అవమానకర వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, లేనిపక్షంలో వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి ఆయనను బర్తరఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలని కోరాయి. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బిజెపి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించాయి. అమిత్ షా రాజీనామా కోరుతూ 30న జాతీయ నిరసన దినంగా వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీ, ఎస్‌యుసిఐ(సి), ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. పలు జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు నిర్వహించారు.

విజయవాడలోని అంబేద్కర్ స్మృతివనం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవి బాధ్యతలు చేపట్టిన అమిత్ షా రాజ్యాంగ దినోత్సవం రోజునే అంబేద్కర్ పేరు ఉచ్చరించడమే సిగ్గు చేటన్నారు. అమిత్ షా వ్యాఖ్యలు ఉద్రేకాలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయని విమర్శించారు. ఆ రోజుల్లో గాంధీని భౌతికంగా హత్య చేశారు. ఈ రోజు అంబేద్కర్ ఆశయాలను హత్య చేస్తున్నారు. సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థకు లేని గౌరవం ఆపాదించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఛలో విజయవాడకు విశ్వహిందూ పరిషత్ పిలుపునిచ్చిందని, కులాన్ని ఇంట్లో పెట్టుకోవాలని, మతాన్ని బయటకు తేవాలనే నినాదం చేస్తున్నారని తెలిపారు. అంటే రిజర్వేషన్లను అడగొట్టాలని, దళితులపై అత్యాచారాలను, కుల వివక్షను, అంటరాని తనాన్ని ప్రోత్సహించుకుంటున్నదనే వీరి ఉద్దేశమన్నారు. ఇది అణగారిన కులాలను అణగదొక్కడం తప్ప ఇంకొకటి కాదన్నారు. ఇది కేవలం వామపక్షాల సమస్యే కాదని, దేశ ప్రజల సమస్యని, ప్రజలందరూ తమ పోరాటానికి మద్దతునివ్వాలని కోరారు. ఈ వివాదంపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతుంటే రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రతిపక్షనేత జగన్ ఈ అంశంపై నోరు తెరవకపోవడం శోచనీయమన్నారు. సనాతన ధర్మమంటే అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించడమా? మోదీ నియంతృత్వాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దడమా? అని పవన్‌ను ప్రశ్నించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... అంబేద్కర్‌ను కించపరచడంతో బిజెపి నిజస్వరూపం, ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశం ఏమిటో బయటపడిందన్నారు. గత ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించారని, ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కేవలం 240 సీట్లకే పరిమితం చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చివేసే లక్ష్యంగా బిజెపి పని చేస్తోందని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రానికి లొంగిపోయి జీ హుజూర్ అంటున్నాయన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి.హరినాథ్, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.జానకిరాములు, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.కె ఖాదర్ బాషా, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.పోలారి తదితరులు ప్రసంగించారు. అమిత్ షా రాజీనామా చేయాలని, లేని పక్షంలో మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణకు లౌకిక ప్రజాతంత్రవాదులు నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావులు అధ్యక్షత వహించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఎం నాయకులు జి.నటరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎల్‌ఐసి డివిజన్ ప్రధాన కార్యాలయం వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఆందోళనకారుల చేతిలో ఉన్న అమిత్ షా దిష్టిబొమ్మను పోలీసులు లాక్కునే క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు ఆ దిష్టిబొమ్మను వామపక్ష కార్యకర్తలు ముక్కలు ముక్కలు చేశారు. తగరపువలసలోని ఎన్‌హెచ్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలోని రాజవొమ్మంగి, చింతూరు, ఎటపాక మండలం తోటపల్లి, కూనవరం మండలం టేకులబోరు, వి.ఆర్.పురం మండలం రేఖపల్లి తదితర ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆందోళనలు చేపట్టారు. కొయ్యూరులో ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన నిరసన నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరి అంబేద్కర్ సెంటర్‌లో నిరసనలో తెలిపారు. తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలో జాతీయ రహదారి వద్ద నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని ఎన్‌ఆర్‌టి సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ప్రధాన రహదారి కూడలిలో నిరసన తెలిపారు. కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. తిరుపతిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట జరిగిన నిరసన, చిత్తూరులో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బాపట్లలో చేపట్టిన నిరసన ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్ పాల్గొన్నారు. విజయనగరం కలెక్టరేట్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి వి.ఆర్.సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మూలం రమేష్ పాల్గొన్నారు. శ్రీకాకుళం, కడపలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేశారు. అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు.


విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి వాసంశెట్టి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టిటిడి బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వైసిపి హయాంలో విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (విఎంఆర్‌డిఎ) బృహత్తర ప్రణాళికలో అనేక అవకతవకలు జరిగాయని భీమిలికి చెందిన మాధవ రవికుమార్ ఫిర్యాదు చేశారు. దీని వెనుక విజయ సాయిరెడ్డి, ఆయన అనుచరుల హస్తం ఉందని, విచారణ చేపడితే అక్రమాలు బయటపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే తమకూ పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని సెర్ప్ రిటైర్డ్ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.

ఫిబ్రవరి 1 నుంచి భూ రిజిస్ట్రేషన్ విలువ పెంపు

- రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఫిబ్రవరి ఒకటి నుంచి భూమి రిజిస్ట్రేషన్ విలువలు పెరుగుతాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఏయే ప్రాంతాల్లో ఎంతమేర పెంచాల్సి ఉంటుంది? ఏయే ప్రాంతాల్లో తగ్గించాల్సి ఉంటుందనే అంశాలపై జనవరి 15వ తేదీ కల్లా పూర్తిస్థాయి నివేదిక అందించాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారులను మంత్రి ఆదేశించారు. తాడేపల్లిలోని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజి కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన విచ్చలవిడి అప్పుల భారం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, ఇదే సందర్భంలో రాష్ట్రానికి రెవెన్యూ కూడా అవసరమని అన్నారు. ఎక్కడెక్కడ గ్రోత్ కారిడార్లు ఉన్నాయో, ఎక్కడ భూమి రేట్లు బాగా పెరిగాయో అక్కడ మాత్రమే రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతామన్నారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువల పెంపును ఇష్టానుసారంగా చేసుకుంటూ వెళ్లిందని, ఫలితంగా చాలాచోట్ల భూమి విలువల కంటే రిజిస్ట్రేషన్ విలువలు అధికంగా ఉన్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. అటువంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గిస్తామన్నారు. గతేడాదితో పోల్చితే గత ఆరు నెలల్లో ఒక్క సెప్టెంబరు నెలలో తప్ప మిగిలిన అన్ని నెలల్లోనూ అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి తాము టార్గెట్‌గా పెట్టుకున్న రూ.9,500 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. భూ వివాదాలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికి 1.70 లక్షల ఫిర్యాదులు రాగా, అందులో 11 వేల ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. మీడియా సమావేశంలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి శేషగిరిబాబు పాల్గొన్నారు.

పింఛన్లను సరళీకరించాం

- ఎప్పటికప్పుడు వితంతువులకు మంజూరు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్లు ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసిందని రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెల పింఛన్ ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. వీరందరినీ స్పౌజ్ క్యాటగిరీగా గుర్తిస్తూ కొత్తగా 5,402మంది పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఆరేడు నెలలకొకసారి కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి పలికామన్నారు. సిఎం చంద్రబాబు గత నెల 1న శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా స్పౌజ్ కేటగిరి కింద ఎప్పటికప్పుడు వితంతువులకు పింఛన్ మంజూరు చేస్తామని ప్రకటించారన్నారు. స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరు చేసిన వారందరికీ డిసెంబరు31న రూ.4వేల చొప్పున పింఛన్ మంజూరు చేస్తున్నామన్నారు. గత మూడు నెలల వ్యవధిలో వివిధ రకాల కారణాలతో పింఛన్ తీసుకోని 50 వేలమందికి సైతం బకాయిలతో సహా అందించనున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వీరికి రెండు, మూడు నెలల మొత్తాన్ని కలిపి డిసెంబరు31న పంపిణీ చేస్తామన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై భిన్నాభిప్రాయాలు

- ఏకసభ్య కమిషన్ అభిప్రాయాల సేకరణ
- రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసిన మంద కృష్ణ మాదిగ
- భారీగా తరలివచ్చిన ఎంఆర్‌పిఎస్, మాలమహానాడు ప్రతినిధులు


రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

షెడ్యూల్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వివిధ కుల సంఘాల నాయకుల నుండి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, జాతీయ, రాష్ట్ర స్థాయి, ఉమ్మడి గుంటూరు జిల్లాల షెడ్యూల్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు అర్జీలు అందజేశారు. తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేశారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై అర్జీలు అందించడానికి వచ్చిన వికలాంగుల వద్దకు రాజీవ్ రంజన్ మిశ్రా నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశానికి సంబంధించి మొత్తం 124 అర్జీలు వచ్చాయి. మాల మహానాడు చెందిన వారు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌సిలంతా ఐక్యంగా ఉండాలంటే వర్గీకరణ చేయకూడదన్నారు. వర్గీకరణ జరిగితే అంతరాలు పెరుగుతాయని కమిషన్‌కు విన్నవించారు. ఎస్‌సిల మధ్య ఎప్పుడూ ఐక్యత లేదని, మాదిగలు గత 50 ఏళ్లుగా రిజర్వేషన్లు పొందలేక నష్టపోయారని మందకృష్ణ మాదిగ వివరించారు. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. అయితే, గుర్తింపులేని అనేక కులాల స్థితిగతులపై కూడా అధ్యయనం చేయాలని కోరారు.

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్... కమిషన్ ముందు తన వాదన విన్పిస్తూ, మాదిగలు చాలా కాలంగా వెనుకబడి ఉన్నారని, విద్య, ఉద్యోగ అవకాశాలను మాలలు వినియోగించు కుంటున్నారని, జనాభా ప్రాతిపదికన ఎవరి అవకాశాలు వారికి దక్కాలని అన్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలూ వర్గీకరణకు సానుకూలంగా ఉండగా వైసిపి అధినేత జగన్ మాత్రం గోడమీద పిల్లివాటంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

చట్టబద్ధత కల్పించాలి : మందకృష్ణ మాదిగ

సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ నివేదికను పూర్తి అధ్యయనం చేసి మంత్రివర్గ ఆమోదం పొందిన వెంటనే శాసనసభలో ప్రవేశపెట్టి ఎస్‌సి వర్గీకరణకు ఆమోదం తెలపాలని మంద కృష్ణ మాదిగ కోరారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రతి కులానికీ రిజర్వేషన్ ఫలాలు అందాలన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి నియమించిన లోకూర్ కమిటీ కూడా మాదిగలు వెనుకబడ్డారని తేల్చిందని గుర్తు చేశారు. రెల్లి కులంలోని 12 ఉప కులాలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఒక్క శాతం కూడా దక్కడం లేదన్నారు. మాలల్లోని మాల దాసరి కూడా ఎస్‌సి వర్గీకరణ కోరుకుంటున్నారని తెలిపారు.

ఆదాయం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్

- మార్చిలోగా రూ.10 వేల కోట్లకు కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆదాయాన్ని పెంచుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగామార్చి నెలాఖరుకు కనీసం పదివేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రిజర్వ్‌బ్యాంకు, కాగ్, అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం అధికారులు వెలువరిస్తున్న గణాంకాలు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. సొంత పన్నుల ఆదాయం పడిపోవడం, కేంద్రం నుంచి కూడా నిధుల రాబడి తగ్గిపోవడం వంటి కారణాలతో ఎక్కువగా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు ఖజానాకు వాస్తవంగా రావాల్సిన ఆదాయం కూడా తగ్గుతోందని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. దీంతో బకాయిలపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆర్థికశాఖ నిర్ణయించింది.రాష్ట్ర ఖజానాకు వాస్తవంగా రావాల్సిన నిధుల్లో ఎక్కువగా అమ్మకపు పన్ను, జిఎస్‌టి, గనులు, విద్యుత్ బకాయిలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు వంటి శాఖల నుంచే బకాయిలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఒక్క గనుల శాఖ నుంచే నాలుగు వేల కోట్ల వరకు ఆదాయం రావాల్సి ఉందని ఆర్థికశాఖ అధికారి ఒకరు చెప్పారు. లీజు నిధులే కాకుండా, రాయల్టీ, ఇతర వసూళ్లలో కూడా లోటు కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే పాత లెక్కలను వెలికితీసి బకాయిలుగా ఉన్న మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని నిర్ణయించినట్లు ఒక అధికారి వెల్లడించారు. ఇదే సమయంలో పెద్ద మొత్తంలో విద్యుత్ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా ఆదాయం తగ్గిందని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖకు రాకుండానే క్షేత్రస్థాయిలోనే ఒప్పందాలు జరిగిపోతున్నాయని, అందుకే ఆదాయానికి భారీగా గండిపడుతోందని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు.కేంద్రం నుంచి 30 వేల కోట్లు రావాల్సి ఉండగా, కేవలం ఇప్పటివరకు పది వేల కోట్లు మాత్రమే రావడంపైనా ఆర్థికశాఖ దృష్టి సారిస్తోంది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని కనీసంగా పది వేలకోట్ల రూపాయలను మార్చి లోగా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన ఒక సమీక్షలో కూడా ఇదే దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది.

పర్యావరణానికి హాని చేసే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వద్దు

- 8 న మోడీకి నిరసన తెలపాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఆర్సిలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను అనకాపల్లి జిల్లాలో వేంపాడు టోల్ గేట్ నుంచి రాజయ్యపేట ప్రాంతం వరకూ పెట్టడం పర్యావరణానికి ప్రమాదకరమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. నక్కపల్లి ప్రాంతానికి అత్యంత హాని కలిగిస్తుందని 2000లోనే నిపుణుల కమిటీ నిర్ధారించిందని పేర్కొన్నారు. టిడిపి, బిజెపి సంకీర్ణ ప్రభుత్వం పెట్టబోతున్న ఆర్సిలాల్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. విశాఖలోని జగదాంబ సెంటర్ నండూరి ప్రసాదరావు భవన్‌లో సోమవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. విశాఖ స్టీల్ నాణ్యతలో నెంబర్ వన్‌గా ఉందని, దక్షిణ భారతదేశంలో విశాఖ స్టీల్ అమ్మకాలలో అగ్రభాగంలో ఉందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ అమ్మకాలను దెబ్బతీసి విశాఖ స్టీల్‌ను ఆర్సిలాల్ మిట్టల్‌కు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ - చెన్నయ్ పెట్రోలియం, పెట్రో కారిడార్ ఏర్పాటు చేయాలని 2000లో పబ్లిక్ హియరింగ్ జరిగిందని, నక్కపల్లి పోర్టుపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ నక్కపల్లి పోర్టును తిరస్కరించిందని తెలిపారు. అప్పుడు 'అంబాని రిలయన్స్' కోసం, ఇప్పుడు ఆర్సిలాల్ మిట్టల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిసిగ్గుగా ప్రయత్నిస్తుందని తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన పోస్కోకు విశాఖ స్టీల్‌ను కట్టబెట్టాలని నాలుగేళ్లుగా ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. జనవరి ఎనిమిదిన ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో నిరసన తెలపాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని మూసి వేసి అందులో పనిచేస్తున్న 150 మంది కాంట్రాక్టు డిప్లొమో కార్మికులను తొలగించడం ప్రయివేటీకరణలో భాగమేనన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కోసం కేంద్రంపై ఒత్తిడి చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేసి, ఎన్నికలనంతరం ఆర్సిలాల్ మిట్టల్‌కు సొంతగనులు, పర్యావరణ అనుమతుల కోసం నేడు పాకులాడుతున్నారని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్‌ప్లాంట్ పెట్టాల్సి ఉందన్నారు. ఆర్సిలాల్ మిట్టల్‌తో చంద్రబాబు కడపలో ఎందుకు స్టీల్‌ప్లాంట్ పెట్టించలేదని ప్రశ్నించారు. కడప పక్కనే బళ్లారి ఇనుప ఖనిజం ఉన్నా బళ్లారి వదిలి విశాఖ స్టీల్‌ప్లాంట్ పక్కనే మిట్టల్‌తో ప్రయివేటు స్టీల్‌ప్లాంట్ ఎందుకు పెట్టిస్తున్నారో ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రకాశం జిల్లాలోని కొంజేడు, మర్లపాడు ప్రాంతాల్లోని ఇనుప ఖనిజాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులను రప్పించలేకపోతే ఉత్తరాంధ్రకు రాష్ట్ర ప్రభుత్వం ద్రోహం చేయడమే అవుతుందన్నారు.

సంపాదకీయం


తిండి తిప్పలు

దేశంలో ఆహార పదార్థాల ధరలు ఠారెత్తిస్తున్నాయని కేంద్ర గణాంకశాఖ తాజాగా విడుదల చేసిన 'కుటుంబ వినియోగ వ్యయం-2023-24' నివేదిక స్పష్టం చేసింది. కొత్త గృహ వినియోగ సర్వే డేటా అంతకు ముందు సంవత్సరం కంటే ఆహార పదార్థాలపై వ్యయం పెరిగిందని వెల్లడించింది. ఈ సర్వే గతేడాదికి సంబంధించినది. ఈ సంవత్సరం డేటా కనుక వస్తే ధరల వికటాట్టహాసం మరింత ఆవిష్కృతం అవుతుంది. 2023-24లో కుటుంబ నెలవారీ ఖర్చుల్లో గ్రామీణులు ఆహారం కోసం చేసిన ఖర్చు 47.04 శాతం కాగా అంతకు ముందు సంవత్సరం ఆ వ్యయం 46.40 శాతంగా ఉంది. నిరుడు పట్టణ వాసుల్లో ఆహారం కోసం చేసిన ఖర్చు 39.68 శాతం కాగా మునుపటి ఏడాది అది 39.17 శాతం. కుటుంబాల ఆహార ఖర్చు అంతకంతకూ పెరగడమంటే దానర్థం నిత్యావసరాలైన బియ్యం, ఉప్పు, పప్పు, చక్కెర, వంట నూనె, కూరగాయల ధరలు పెరుగుతున్నాయనే. ధరల పెరుగుదల ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదల తీవ్రతను సూచిస్తోంది. ఆహారంపై ఖర్చు గడచిన పన్నెండేళ్లల్లో, సంవత్సర సంవత్సరానికీ పెరుగుదల రేటు అంత పెద్దది కానప్పటికీ, మునుపటి సంవత్సరంనాటి ద్రవ్యోల్బణం పెరుగుదల రేటుతో పోల్చితే గృహ వినియోగ అంశాలను ప్రభావితం చేశాయని నివేదిక తెలుపుతోంది. ఏ గణాంకాలను ఏ రకంగా విశ్లేషించినా వాస్తవంలో జనసామాన్యానికి ధరలు మంట పుట్టిస్తున్నాయని, వారు ఆహారం కోసం చేసే ఖర్చు పెరుగుతోందన్నది వాస్తవ చిత్రం.

ద్రవ్యోల్బణాన్ని అదుపులోనే ఉంచామని చెబుతున్న మోడీ ప్రభుత్వం ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదలపై నాలుక మడత పెడుతోంది. మరో వైపు నిత్యావసరాల ధరల అదుపునకు ఆహార పదార్థాల నిల్వలపై పరిమితులు, ఎగుమతులపై నిషేధం, ఎక్స్‌పోర్టులపై సుంకాల పెంపు వంటి కాయకల్ప చర్యలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తోంది. ఆ చర్యలు ధరల పెరుగుదలను స్వల్పంగా కూడా కట్టడి చేయలేకపోతున్నాయని పూట గడవటం కష్టంగా పరిణమించిన ప్రజల దైనందన జీవనం తెలియజేస్తోంది. ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికి మరొక ముఖ్య కారణం వ్యవసాయ సంక్షోభం, వాతావరణ మార్పులు. ప్రభుత్వ విధానాలు వ్యవసాయ రంగాన్ని బలిపీఠం మీదికి ఎక్కించగా, కరువులు, తుపాన్లు, ఇతర విపత్తులు సాగును ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పోషకాహార లోపం వలన చిన్నారుల్లో, మహిళల్లో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు రోజూ చర్చించుకుంటున్నవే. ప్రపంచ ఆకలి సూచిలో భారత దేశం స్థానం ఎక్కడో చిట్ట చివరన కునారిల్లుతోంది. కొన్నేళ్లుగా మన స్థానంలో ఎలాంటి మార్పు లేదు. 2030 నాటికి ఆకలి లేని ప్రపంచాన్ని సాధించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన లక్ష్యం సమీప భవిష్యత్తులో నెరవేరే జాడ కనిపించట్లేదు. ఈ పరిస్థితుల్లో ఆహార వస్తువుల ధరల పెరుగుదల, ప్రమాదకర స్థాయికి ఆహార ద్రవ్యోల్బణం ప్రజలను ఇంకా ఆహారాన్ని దూరం చేస్తుంది.

అధిక ఆహార ద్రవ్యోల్బణం అధిక రిటైల్ ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వడ్డీ రేట్లు తగ్గించకుండా అడ్డుకునేలా చేస్తుంది. వడ్డీ రేట్ల తగ్గింపునకు ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోరాదన్న డిమాండ్ ప్రముఖంగా ముందుకొస్తోంది. ప్రస్తుతానికి దానిపై ఆర్‌బిఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ భవిష్యత్తులో ఆ దిశగా ఆర్‌బిఐ అడుగులు పడవచ్చున్నది ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. ప్రాతిపదిక సంవత్సరాలను మార్చినా, మరే జిమ్మిక్కు చేసినా ద్రవ్యోల్బణం తగ్గినట్టు చూపించవచ్చునేమో కానీ ఆహార ద్రవ్యోల్బణం సవాల్ అలాగే ఉంటుంది. నయా-ఉదారవాద విధానాలే అందుకు కారణం. ప్రభుత్వ ఖర్చు పెరిగితే ప్రజల ఉపాధి, ఆదాయాలు, సంక్షేమం మెరుగవుతాయి. ఆ ప్రభావం ద్రవ్యోల్బణాన్ని, ఆహార ద్రవ్యోల్బణం తగ్గించవచ్చునేమో కానీ నయా-ఉదారవాద విధానాలను విడనాడటం కాదు, వాటిని మరింత వేగంగా అమలు చేయసిద్ధమైంది కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం. కాబట్టి ప్రజలు ధరల పెరుగుదలను, ఆ విధానాలను వ్యతిరేకించడమే మార్గం.

మహనీయుల మాట



పోటీలో ఒకళ్లే గెలుస్తారు.
గెలవలేని మిగతా పిల్లలు
నిరాశ, నిస్పృహలకు బలైపోతారు.
జీవచ్ఛవాలుగా మిగిలిపోతారు.
నిజానికి పోటీ అనేది
విద్యార్థులలోని ప్రాణ శక్తిని
హరించివేస్తుంది. వారిని
వికృతరూపులుగా చేస్తుంది.
- గిజుభాయి

ట్రంప్ సుంకాల బెదిరింపులు-పర్యవసానాలు

ప్రజా ప్రస్థానం



> అమెరికాలో ట్రంప్ దిగుమతి సుంకాలు పెంచితే మౌన ముద్ర పాటించే బ్రెట్టన్‌వుడ్ సంస్థలు మూడవ ప్రపంచ దేశాలకు మాత్రం అటువంటి రక్షణాత్మక చర్యలు చేపట్టడద్దని, స్వేచ్ఛా వ్యాపారం చాలా విశిష్టమైనదని జ్ఞానబోధలు చేస్తాయి. దానితోబాటు ఆ దేశాలు ద్రవ్యలోటును నియంత్రించే విషయంలో షరతులకు కచ్చితంగా లోబడి వుండేలా ఒత్తిడి చేస్తాయి. ఆ విధంగా మూడవ ప్రపంచ దేశాలన్నీ నిస్సహాయంగా అమెరికన్ ప్రభుత్వం తీసుకునే రక్షణాత్మక చర్యల దుష్ప్రభావాన్ని భరించవలసి వస్తుంది. దానితోబాటు నానాటికీ తీవ్రమయ్యే ఆర్థిక మాంద్యం ప్రభావాన్ని కూడా మోయవలసి వుంటుంది.



ప్రభాత్ పట్నాయక్

అధిక సుంకాలను విధిస్తానంటూ ట్రంప్ తక్కిన దేశాలను బెదిరిస్తున్నాడు. మొదట బ్రిక్స్ దేశాలను బెదిరించాడు. ఆ దేశాలు గనుక డాలర్ మాధ్యమంలో వ్యాపారం చేయడం మానుకుంటే వాటి సరుకులపై అమెరికాలో 100 శాతం దిగుమతి సుంకం విధిస్తానని ప్రకటించాడు. ఆ తర్వాత వంతు యూరోపియన్ యూనియన్ (ఇ.యు) దేశాలది. 2023లో ఆ దేశాలు అమెరికాకు చేస్తున్న ఎగుమతులు అమెరికా నుండి చేసుకుంటున్న దిగుమతుల కన్నా 208.7 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. అంటే వాటితో అమెరికా వాణిజ్యం లోటులో ఉంది. అందుచేత ఆ దేశాలు గనుక అమెరికా నుండి ముడిచమురు, సహజ వాయువు కొనుగోళ్ళను పెంచకపోతే ఆ దేశాల నుండి అమెరికాకు వచ్చే దిగుమతుల మీద సుంకాలను పెంచుతానని హెచ్చరించాడు. ఇవిగాక ప్రపంచంలో ఏ దేశం నుండి అయినా అమెరికాకు దిగుమతయ్యే సరుకులన్నింటి మీదా 10 శాతం సుంకం పెంచుతానని, ప్రత్యేకించి చైనా నుండి వచ్చే దిగుమతుల మీద 60 శాతం పెంచుతానని ప్రకటించాడు. 2023లో చైనా నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులు ఎగుమతులకన్నా 279.4 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. 2018లోనైతే అవి 418 బిలియన్ డాలర్లు అధికంగా ఉన్నాయి. అప్పటి నుంచి కొంత తగ్గినా, ఇంకా చైనాతో అమెరికా వాణిజ్య లోటు గణనీయంగానే ఉంది.

ఇలా విధించే అధిక సుంకాల ఫలితంగా ఆర్థిక రంగంలో ముఖ్యమైన పరిణామాలు జరుగుతాయి. ఇప్పటికీ ఇ.యు దేశాలు ఇంకా రష్యన్ ముడిచమురు, సహజ వాయువు దిగుమతుల మీద కొంతవరకూ ఆధారపడుతూనే వున్నాయి. అది కూడా లేకుండా మొత్తం అమెరికా నుండే కొనుగోలు చేస్తే అప్పుడు దానివలన ఇ.యు దేశాల్లో చమురు ధరలు ఏమీ పెరగకపోవచ్చు. కాని అమెరికాలో పెట్రోలు, సహజ వాయువు ధరలు కనీసం 30 శాతం పెరుగుతాయి. ఇయు దేశాలు అదనంగా కొనుగోళ్ళు పెంచిన ఫలితంగా అమెరికన్ చమురు డిమాండ్ పెరుగుతుంది. ముడి చమురు అంతర్జాతీయ ధరలు ఒకే విధంగా ఉంటాయి గనుక ఇ.యు లో దాని ప్రభావం ఉండదు. కాని అమెరికా వద్ద చమురు నిల్వలు తగ్గిపోయి, ఆ దేశంలో పెరిగే డిమాండ్‌ను తట్టుకోవడానికి అక్కడ ధరలు పెరుగుతాయి. ఇలా పెరిగిన డిమాండ్‌ను తట్టుకోవడానికి అమెరికా తన చమురు ఉత్పత్తిని అందుకు తగినట్టు పెంచుతుందని ట్రంప్ ప్రకటించాడు. కాని అమెరికాలో చమురు ఉత్పత్తి వ్యాపారం అంతా ప్రైవేటు రంగంలోనే ఉంది. చమురు ఉత్పత్తిని పెంచాలంటే ప్రైవేటు కార్పొరేట్లు అందుకు అదనంగా పెట్టుబడులు పెట్టాలి. అది అంత తేలికేమీ కాదు. ముడిచమురు, సహజ వాయువులను వెలికి తీయడం అనేది పర్యావరణ సమస్యను పెంచుతుంది. పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడానికి అమెరికా ఆమోదించిన పరిమితులను ఉల్లంఘించడం అంత సులభసాధ్యం ఏమీ కాబోదు. దానిని దృష్టిలో ఉంచుకునే ప్రైవేటు పెట్టుబడిదారులు అదనపు పెట్టుబడులను పెట్టడానికి అంత ఉత్సాహాన్ని చూపకపోవచ్చు. అదే విధంగా బ్రిక్స్ దేశాల మీద 100 శాతం సుంకాన్ని అదనంగా విధించడం వలన ఆ దేశాలు దానికి ప్రతీకారంగా తీసుకునే చర్యలు అమెరికన్ ఎగుమతులను దెబ్బ తీసే అవకాశం ఉంది.

అయితే ప్రస్తుతానికి ఇవన్నీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు. కాని అన్ని దిగుమతులపైనా 10 శాతం సుంకం పెంపు అనే ప్రతిపాదన, చైనా దిగుమతుల మీద 60 శాతం సుంకం పెంపు ప్రతిపాదన కార్యరూపం ధరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చర్యల పర్యవసానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ఏ విధంగా ఉండబోతున్నాయో ఇప్పుడు చూద్దాం. కాస్సేపు ఈ రెండు చర్యలకూ తక్కిన దేశాల నుండి ప్రతీకార చర్యలు ఉండవనే అనుకుందాం. బైట దేశాల దిగుమతుల మీద సుంకాలు పెరిగితే వాటి ధరలు అమెరికాలో పెరుగుతాయి. అప్పుడు వాటికి బదులు అమెరికన్ ఉత్పత్తులనే కొనుగోలు చేయడానికి అక్కడి ప్రజలు మొగ్గు చూపుతారు. దానివలన అమెరికన్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. ఆ డిమాండ్‌ను అందుకోడానికి వీలుగా అమెరికన్ కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచవలసి వుంటుంది. దాని పర్యవసానంగా అమెరికాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

అదే సమయంలో దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన వాటి ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా అమెరికన్ ప్రజల కొనుగోలుశక్తి దెబ్బ తింటుంది. అది ఉపాధి అవకాశాలు తగ్గిపోవడానికి దారి తీస్తుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ట్రంప్ ప్రభుత్వం గనుక 'పొదుపు' చర్యలు చేపట్టడం కూడా జరిగితే (అంటే ప్రజా సంక్షేమం మీద ఖర్చు తగ్గిస్తే) ప్రజల కొనుగోలు శక్తి ఇంకా బాగా తగ్గుతుంది. దాని వలన ఉపాధి ఇంకా ఎక్కువగా దెబ్బ తింటుంది. అయితే, రెండోవైపు దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి దాని వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయి గనుక నికరంగా అమెరికాలో అటు ఉత్పత్తి, ఇటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అనుకుందాం.

అయితే తక్కిన ప్రపంచంలో పరిణామాలు వేరేగా ఉంటాయి. అమెరికా విధించిన సుంకాల పెంపు వలన ఆ దేశాల నుండి అమెరికాకు జరిగే ఎగుమతులు తగ్గుతాయి. ఆ మేరకు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచే చర్యలు చేపట్టడం సాధ్యపడదు కనుక ఆ దేశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. నయా ఉదారవాద చట్రంలో చైనా మినహా తక్కిన దేశాలన్నీ ఉన్నాయి కనుక ఆ దేశాల ప్రభుత్వాలు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచడానికి కావలసిన చర్యలను చేపట్టడం సాధ్యపడదు.

అలా డిమాండ్‌ను పెంచాలంటే ప్రభుత్వం చేసే వ్యయాన్ని పెంచాలి. అందుకు తమ దేశ ద్రవ్యలోటునైనా పెంచాలి. లేదా పెట్టుబడిదారుల మీద అదనపు పన్నులనైనా వేయాలి. కాని ఈ రెండు రకాల చర్యలనూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. అయినా దానిని లెక్క చేయకుండా ఏ దేశమైనా వ్యయాన్ని పెంచడానికి చర్యలు చేపడితే ఆ దేశం నుండి ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో బైటకు తరలిపోతుంది. దాని ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ అస్థిరతకు లోనౌతుంది.

నిజానికి అమెరికాలో దిగుమతి సుంకాల పెంపు అనేది కూడా ఎంతో కొంత మేరకు నయా ఉదారవాద చట్రానికి భిన్నమైన చర్యగానే చెప్పవచ్చు. అటువంటి చర్యలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కొంత వరకూ సహిస్తుంది. అదే గనుక ఏ దేశమైనా పెట్టుబడుల సంచారం మీద ఆంక్షలు విధిస్తే ఏ మాత్రమూ సహించదు. అందుకే ట్రంప్ పెట్టుబడుల కదలికలను నియంత్రించే విషయంలో ఒక్కమాట కూడా అనలేదు.

చైనా పరిస్థితి పూర్తిగా భిన్నం. నిజానికి కొంతకాలంగా అమెరికన్ ప్రభుత్వాలు తమ దేశంలోకి వచ్చిపడుతున్న చైనా ఉత్పత్తుల తాకిడి నుంచి తమ దేశాన్ని కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటూనే వున్నాయి. అందుకే అమెరికాకు చైనా దిగుమతులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయితే దాని ప్రభావాన్ని వీలైనంత మేరకు తగ్గించడానికి చైనా తన దేశీయ మార్కెట్ ను విస్తరించుకుంటోంది. ఇలా చైనా చేయగలగడానికి కారణం చైనా ఆర్థిక వ్యవస్థ, అందులో ఎన్ని రకాల మార్పులు జరిగినా, ఇప్పటికీ ప్రధానంగా ప్రభుత్వ నియంత్రణలో నడిచే వ్యవస్థగానే కొనసాగుతోంది. అక్కడ రాజకీయ నిర్ణయాలకు లోబడి ఆర్థిక వ్యవహారాలు సాగుతాయి. ఇంకా అక్కడ ప్రభుత్వ రంగమే గణనీయమైన భాగంగా ఉంది. పెట్టుబడిదారుల చేతుల్లో లేని ఈ భాగంలో పెట్టుబడికి, వేతనాలకు సంబంధించిన నిర్ణయాలన్నీ ప్రభుత్వమే చేస్తుంది. తక్కిన ప్రపంచంలో కార్మికుల నిజ వేతనాలు దాదాపు స్తంభించిపోయివున్న ప్రస్తుత కాలంలో చైనాలో కార్మికుల నిజవేతనాలు పెరుగుతున్నాయి. ఇందుకు కారణం అక్కడ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలే. అందుచేత చైనాలోని దేశీయ మార్కెట్ విస్తరణను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలు అడ్డుకోలేవు. కాని తక్కిన పెట్టుబడిదారీ దేశాల్లో అడ్డుకోగలుగుతాయి.

ఈ కారణంగా అమెరికా విధించే అధిక సుంకాల ప్రభావం వలన చైనా మినహా తక్కిన ప్రపంచ దేశాల్లో ఆర్థిక మాంద్యం మరింత తీవ్రం అవుతుంది (నయా ఉదారవాద చట్రం నుండి బైట పడినప్పుడే ఈ పరిస్థితి నుండి బైట పడడం సాధ్యం). మూడవ ప్రపంచ దేశాల్లో, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఈ తీవ్రత మరి కాస్త ఎక్కువగా ఉంటుంది.

అమెరికాలో ట్రంప్ దిగుమతి సుంకాలు పెంచితే మౌన ముద్ర పాటించే బ్రెట్టన్‌వుడ్ సంస్థలు మూడవ ప్రపంచ దేశాలకు మాత్రం అటువంటి రక్షణాత్మక చర్యలు చేపట్టడద్దని, స్వేచ్ఛా వ్యాపారం చాలా విశిష్టమైనదని జ్ఞానబోధలు చేస్తాయి. దానితోబాటు ఆ దేశాలు ద్రవ్యలోటును నియంత్రించే విషయంలో షరతులకు కచ్చితంగా లోబడి వుండేలా ఒత్తిడి చేస్తాయి. ఆ విధంగా మూడవ ప్రపంచ దేశాలన్నీ నిస్సహాయంగా అమెరికన్ ప్రభుత్వం తీసుకునే రక్షణాత్మక చర్యల దుష్ప్రభావాన్ని భరించవలసి వస్తుంది. దానితోబాటు నానాటికీ తీవ్రమయ్యే ఆర్థిక మాంద్యం ప్రభావాన్ని కూడా మోయవలసి వుంటుంది.

ఇలా ఆర్థిక మాంద్యం తీవ్రం అవుతున్నకొద్దీ, రెండో పక్క నయా ఫాసిస్టు ధోరణులు కూడా ప్రపంచవ్యాప్తంగా బలపడతాయి. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్పొరేట్లకు, నయా ఫాసిస్టు శక్తులకు నడుమ బంధం బలంగా ఏర్పడుతుంది. ఆ సంక్షోభం ముదురుతున్నకొద్దీ ఈ బంధం కూడా మరింత బలపడుతుంది. ఏవో కొన్ని మైనారిటీ సెక్షన్ల ప్రజలను శత్రువులుగా చిత్రించి సమాజ జీవిత వాస్తవాల నుండి ప్రజల దృష్టిని పక్కకు మరల్చే ప్రచారం ఉధృతమౌతుంది.

పెట్టుబడిదారీ విధానం ముందుకు సాగుతున్నకొద్దీ ప్రజలు సోషలిజం లేదా ఆటవిక వ్యవస్థ-ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని రోజా లగ్జెంబర్గ్ చెప్పినది నేడు వాస్తవ రూపం ధరిస్తోంది. పెట్టుబడిదారీ విధానపు తాజా దశ అయిన నయా ఉదారవాద వ్యవస్థ ముందు ఇప్పుడున్న దారులన్నీ మూసుకుపోయాయి. అది ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని ఆటవిక స్వభావం గల నయా ఫాసిజం వైపు నెడుతోంది. ఈ పరిస్థితి నుండి బైట పడడానికి సోషలిజం కోసం పోరాడడం ఒక్కటే మార్గం.


(స్వేచ్ఛానుసరణ)

★

వేగంగా మారుతున్న వైరస్‌లు

ఒరవడి మార్చుకోని మానవులు!

సమస్య



ప్రొ॥యన్. వేణుగోపాలరావు

> వైరస్‌లు నిరంతరం రూపాంతరం చెందుతూ తమ మనుగడను కొనసాగిస్తున్నాయి. జీవుల్ని వివిధ రకాల జబ్బుల రూపంలో ప్రభావితం చేస్తున్నాయి. మొదటి, రెండవ తెరల కోవిడ్ వల్ల లక్షల మంది చనిపోయారు. మూడవ తెరగా మారిన కొత్త రూపాలను (వేరియంట్లను) చూశాం. అయినా మనుషుల ధోరణి మారడం లేదు. టీకా ఆవిష్కరణ గొప్ప పరిష్కారం చూపిస్తుందని ఆశించాంగానీ దాన్ని పేటెంట్ చట్టంలో ఇరికించి పూర్తి వ్యాపార వస్తువుగా మార్చేశారు. టీకా వాడుక ఉద్యమాలు ధనిక దేశాల్లో విస్తరించినంతగా పేద దేశాల్లో విస్తరించడం లేదు. పైగా వైరస్‌లు రూపాంతరం చెందుతూ పాత టీకాల ప్రభావాన్ని దిగజార్చే స్థాయికి చేరుకొంటున్నాయి. ఇలా సైన్సు, సాంకేతికాలు వ్యాపార వస్తువులవుతున్నంత కాలం వైరస్ లాంటి సూక్ష్మాతి సూక్ష్మజీవులు మనుషుల్ని వణికిస్తూనే వుంటాయి.

జీవాలకు, నిర్జీవాలకు సంధానకర్తలుగా వున్న వైరస్‌లు ఇంకా అత్యంత శక్తివంతమైనవిగా ఎలా మనగలుగుతున్నాయి? పంట మొక్కలను తెగుళ్ల రూపంలో, మనుషులను రోగాల రూపంలో ఈ వైరస్‌లు దాడి చేస్తూ ఎలా బెదిరించగలుగుతున్నాయి? కరోనా, క్యాన్సర్ కారకాల్లాంటివి మానవులకూ, మిర్చి పైరునాశించే బొబ్బర వైరస్ తెగుళ్లు, అపరాల పంటలను ఆశించే ఆకు ముడత, ఆకు మచ్చ (పండాకు) తెగుళ్ల లాంటివి మొక్కలకూ అంతు చిక్కని బెడదగా ఎలా పరిణమించగలిగాయి? మందుల కంపెనీలు, "సర్వ జ్ఞాన" సైంటిస్టులు వాటి అదుపునకు ఘాటు రసాయనాలు కనిపెట్టీ కనిపెట్టక ముందే ఈ వైరస్‌లు ఇన్ని భిన్న రూపాలను ఎలా సంతరించుకోగలుగుతున్నాయి?

కరోనా వచ్చిన సంవత్సరానంతర కాలంలో రైతులు, రైతు కూలీలు, భవన నిర్మాణ కార్మికుల వంటి శ్రమజీవులు తప్ప మిగిలిన ప్రజలందరూ మాస్కులు, శానిటైజర్లు వాడారు. అవి వైరస్‌ను అరికడతాయని ప్రచారం జరిగింది. అదే విధంగా పంట వైరస్ తెగుళ్ల అదుపు కోసం కూడా కొత్త కొత్త కృత్రిమ రసాయనాలను వాడి పంటలను రక్షించుకోండి అంటూ నిపుణులు సూచిస్తూనే ఉన్నారు. రైతులు కోట్లు కుమ్మరించి వాటిని వాడుతూనే ఉన్నారు. అయినా జరిగే నష్టం పెరగడమే తప్ప తరగడం లేదు.

కావాల్సింది రోగనిరోధకత

కరోనా వైరస్ వ్యాధి నిరోధక శక్తి కలిగిన వారికి, తెగుళ్ల వైరస్‌లు వాటిని తట్టుకోగలిగిన పంట రకాలకు రావడం లేదని తెలుస్తూనే వుంది. అలానే మంచి పోషకాలున్న ఆహారం పొందగలిగిన మనుషులకూ, సమగ్ర పోషణ రక్షణలో పెరుగుతున్న పంటలకూ ఈ వైరస్‌ల దాడి తక్కువని కూడా తేలింది. అయినా ప్రభుత్వం, దాని నీడలో బతికే మందుల కంపెనీలు మాత్రం ప్రజల్ని గందరగోళంలోకి నెడుతూనే వున్నాయి. మధ్యలో ఆనందయ్యలు, రాందేవ్ బాబాలు రంగంలోకి దిగి మరింత గజిబిజి సృష్టిస్తూనే వున్నారు.

నిజానికి టీకా (వ్యాక్సిన్) మూల లక్షణం వ్యాధి నిరోధక శక్తిని పెంచడం. అంటే వైరస్‌ను ఎదుర్కోగలిగిన శక్తిని జీవుల్లో కలిగించడం. అయితే అమెరికా వంటి ధనిక దేశాలూ, మన లాంటి వర్ధమాన దేశాలు కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్న ఏ లక్ష్యాన్ని పట్టించుకోవడం లేదు. లాభాల పోటీల్లో కంపెనీలు ప్రాథమిక ఆరోగ్య నియమాల్ని గాలికి వదిలేశాయి. అలానే వైరస్ తెగుళ్ళను రసాయనాలు అరికట్టలేవని తెలిసి కూడా పదేపదే అదే దిశలో ప్రచారం నడుస్తున్నది. దీనికి ముఖ్య కారణం సామాన్యులకు, రైతులకు కార్యకారక సంబంధాల పరంగా వైరస్ జబ్బుల అదుపు గురించి తెలియకపోవడమే.

బలహీన జీవులూ బతకగలవు

జీవ పరిణామం నేపథ్యంలో వివిధ జీవులు (తమకు అవసరమైన ప్రత్యేక లక్షణాలను సంతరించుకున్న ప్రాణులుగా) ఉద్భవించి భిన్న స్థితి లక్షణాల్ని సంతరించుకున్న జీవులుగా మారినా మొదటి మూల దశ జీవులు యథాతథంగానే కొనసాగగలవు. దానికి ముఖ్య కారణం ప్రతి జీవికి దిగ్విజయంగా జీవనం కొనసాగించగలిగిన ప్రత్యేక జీవ ప్రక్రియల నిలయం /కాలం పద్ధతి ఒకటి ఏర్పాటై వుండడం. ఈ ప్రత్యేక నిలయం/ ఆవాసం యొక్క పరమార్థం మనకు ఒక జీవి మరో జీవితో పోటీ పడే ప్రక్రియలో అర్థమవుతుంది. ఒకే తిండి, ఒకే కాలం, ఒకే జీవన విధానంగల జీవులు సమాంతరంగా మనలేవు. కొన్ని తొలగిపోతాయి. అనగా జీవుల మనుగడకు మూలమైన ఆహారం, ఆవాసం, పునరుత్పత్తి ప్రక్రియలకు స్థానిక కొరత ఏర్పడుతుంది. ఈ స్థితిలో కొన్ని జీవులు పోటీకి నిలవలేనివి అనివార్యంగా అంతరించిపోతాయి. పరిణామ క్రమంలో అనేక జీవులు అంతరించడాన్ని వివిధ దశల్లో మనం గమనించాం.


అయితే జీవులు పోటీకి తట్టుకునే క్రమంలో తమ ఆహార, ఆవాస, పునరుత్పత్తి ప్రక్రియల్ని మార్చుకోగలవు. దీన్ని పురుగుల్లో కూడా మనం చూడవచ్చు. ఈ ప్రక్రియ వల్ల కొన్ని బలహీనమైన జీవులు కూడా పోటీలో తట్టుకునే స్థితిని సంతరించుకుంటాయి.

జన్యుపరమైన వైవిధ్యత, బాహ్య శరీర నిర్మాణాలపై పరిసరాల ప్రభావం ఎక్కువ. డిఆక్సీ (రైబోజ్) న్యూక్లికామ్లాల కలయిక (ఆర్ఎన్ఏ) ద్వారా నిర్మించబడుతున్న మూల జన్యువులు తమ నిరంతర కలయిక ద్వారా, మార్పుల ద్వారా జీవి రూపాలను ప్రభావితం చేస్తుంటాయి. వీటిని ప్రాథమికమైనవనో, బలహీనమైనవనో భావించడం అశాస్త్రీయం. ముఖ్యంగా పరాన్న జీవులైన వైరస్‌లు, బ్యాక్టీరియా జీవులు నిర్మాణ రీత్యా జన్యుపర సౌలభ్యతకు ప్రతీకలు. కానీ ఉన్నత జీవులుగా మనం పేర్కొనే మనుషుల శరీరం నిర్మాణం జన్యు పరంగా ఉత్పరివర్తన (మ్యుటేషన్) చెందడానికి అంత అనుకూలం కాదు. పైగా మానవుల 90 శాతం జన్యువులు ఒకే తరహా ప్రక్రియకు మూలాలు. ఇప్పుడు మనం మనుషుల మధ్య చూస్తున్న వైవిధ్యతలన్నీ పరిసరాల ప్రభావంతో మాత్రమే కొనసాగుతున్నవని గుర్తించాలి.

వైరస్‌లే వేగంగా మారగలవు!

మరో ముఖ్యమైన అంశం ఏమంటే జీవ పరిణామం ఒకే దిశలో జరుగుతూ వుండదు. పునరుత్పత్తి, జన్యు వైవిధ్యత, మూల వనరుల లభ్యత వంటి అనుకూలతలు గల్గిన జీవుల నుండే ఉన్నత స్థాయి జీవులు రూపొందే అవకాశం ఉంటుందనేది సరైన అభిప్రాయం కాదు. దీన్ని శాస్త్రవేత్తలు నిరూపించారు. వివిధ సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో జరిగిన జన్యు కలయికలను బట్టి భిన్నమైన దశలో జీవ పరిణామం జరిగిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి.

సూక్ష్మ క్రిములుగా పిలవబడే వైరస్, బూజు, ఫంగస్, మైకో ప్లాస్మా, బ్యాక్టీరియాల్ని తరచుగా ప్రాథమిక జీవులుగా పేర్కొనడం జరుగుతున్నది. వాటి జన్యుపరమైన నిర్మాణం సంక్లిష్టంగా లేకపోవచ్చు గానీ అవే విజయవంతంగా మనుషుల మీదా, జీవుల మీదా, వృక్షాల మీదా దాడి చేయగలుగుతున్నాయి. వాటి మీద బతకగల్గుతున్నాయి. వేగంగా రూపాంతరం చెందగలుగుతున్నాయి. మన కొలమానాల ప్రకారం ప్రాథమిక జీవులైన వాటికి ఉన్నత జీవులు లొంగిపోతున్నాయి. దీనికి కారణం ఏమంటే జన్యుపరమైన సంక్లిష్టతలు తక్కువగా ఉన్న సూక్ష్మజీవులు మనుగడకు అవసరమైన జన్యు నిర్మాణాన్ని వేగంగా సమకూర్చుకోగలవు. దాన్నే జన్యుపరంగా మ్యుటేషన్ అంటారు. దీన్ని "తన మనుగడకు తగిన స్థాయిని పెంచుకోవడం, మార్పులు చేసుకోగల్గడం" అనుకోవచ్చు. ఇలా వైవిధ్య రూపాలు (వేరియంట్లు) అనివార్యంగా అవతరిస్తాయి.



మారాల్సింది మానవుడు!

కోవిడ్ 19 నేపథ్యంలో ఆలోచిస్తే "ఒక ప్రాథమిక జీవి బారిన ఒక ఉన్నత స్థాయి జీవి పడ్డది" అనేది అశాస్త్రీయ అవగాహన. నిజానికి మనుషులు ఎప్పుడూ ఉన్నత స్థాయి జన్యపర నిర్మాణం ద్వారా వైరస్‌లను దాటిపోలేదు. వాస్తవానికి మనుషుల సంక్లిష్ట జన్యు నిర్మాణమే సూక్ష్మాతి సూక్ష్మజీవులతో పోటీ పడాల్సి వస్తోంది.

ఇలా వైరస్‌లు నిరంతరం రూపాంతరం చెందుతూ తమ మనుగడను కొనసాగిస్తున్నాయి. జీవుల్ని వివిధ రకాల జబ్బుల రూపంలో ప్రభావితం చేస్తున్నాయి. మొదటి, రెండవ తెరల కోవిడ్ వల్ల లక్షల మంది చనిపోయారు. మూడవ తెరగా మారిన కొత్త రూపాలను (వేరియంట్లను) చూశాం. అయినా మనుషుల ధోరణి మారడం లేదు.

టీకా ఆవిష్కరణ గొప్ప పరిష్కారం చూపిస్తుందని ఆశించాంగానీ దాన్ని పేటెంట్ చట్టంలో ఇరికించి పూర్తి వ్యాపార వస్తువుగా మార్చేశారు. టీకా వాడుక ఉద్యమాలు ధనిక దేశాల్లో విస్తరించినంతగా పేద దేశాల్లో విస్తరించడం లేదు. పైగా వైరస్‌లు రూపాంతరం చెందుతూ పాత టీకాల ప్రభావాన్ని దిగజార్చే స్థాయికి చేరుకొంటున్నాయి. ఇలా సైన్సు, సాంకేతికాలు వ్యాపార వస్తువులవుతున్నంత కాలం వైరస్ లాంటి సూక్ష్మాతి సూక్ష్మజీవులు మనుషుల్ని వణికిస్తూనే వుంటాయి.

/వ్యాసకర్త విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త /

జనవాక్యం

హంపి ఇంపైన విజయం

ర్యాపిడ్ చెస్ మహిళా విభాగంలో విశ్వ కిరీటం సాధించిన కోనేరు హంపికి అభినందనలు. ఇది మామూలు విజయం కాదు. ఇంపైన విజయం. ఎందుకంటే ఆమే చెప్పినట్టు 37 ఏళ్ల వయసులో యువ ఆటగాళ్లతో పోటీ పడి గెలవడం దుస్సాధ్యం. ఆ వయసు వాళ్లు కుటుంబం తదితర అదనపు వత్తిడుల మధ్య ప్రాక్టీసు కొనసాగించడం, ప్రపంచ స్థాయి మెరికలతో ఢీకొని గెలుపు చేజిక్కించుకోవడం గ్రేట్. ఆ విషయంలో సహకరించిన కుటుంబ సభ్యులను కూడా అభినందించాలి. పైగా ఈ విజయం ఆమె సాధించడం రెండో సారి. ఇంతవరకూ ఆ రికార్డు చైనా చేతిలో మాత్రమే ఉంది. హంపి నేడు సాధించిన ప్రపంచ చాంపియన్ షిప్ ఎంతోమంది క్రీడాకారులకు మెరుగైన భవిత పట్ల ఆశ నింపగలదు. భారత దేశం మళ్లీ ప్రపంచ చదరంగం లో జయకేతనం ఎగురవేసింది. ఈ సంవత్సరమే ఒలింపియాడ్‌లో ఉన్న రెండు బంగారు పతకాలూ సాధించడం, తర్వాత పద్దెనిమిదేళ్ల వయస్సులోనే గుకేశ్ ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించడం, మళ్లీ రాపిడ్ చెస్ విభాగంలో కూడా హంపి రూపంలో భారత్ కిరీటధారి కావడం గర్వకారణం. ప్రపంచ చెస్ రంగంలో భారత్ అగ్రగామిగా తళుకులీనబోతున్నది. తథ్యం.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను
పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

ఎన్నికల్లో పోటీకి ఆర్థిక సహకారం అందించండి

- ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు ఆర్థిక సహకారం అందించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా కోరారు. సోమవారం ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎంవోఓ4జంగ్ పుర' ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. 'సపోర్ట్ అండ్ ఫండ్ మనీష్ సిసోడియా' నినాదంతో నీలం, పసుపు పోస్టర్ విడుదల చేశారు. 'నేను ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి మీ ఆర్థిక సహకారం వల్లే విజయం సాధించాను. ఈసారి కూడా నా ఎన్నికల మీ ఆర్థిక సహకారం కావాలి. మీరు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయి ఢిల్లీలో ఉద్యోగం, విద్య రాజకీయాల అభివృద్ధికి దోహదపడుతుంది. నగరంలో విద్య, పాలనా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలకు ఆర్థిక వనరులు కూడా మూలంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు. 2015 నుంచి పటపర్‌గంజ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిసోడియా, ఈసారి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు.

పూజారులకు రూ.18 వేల గౌరవ వేతనం : కేజ్రీవాల్

హిందూ, సిక్కు పూజారులు (అర్చకులకు) నెలకు రూ.18 వేల గౌరవ వేతనం అందించేందుకు 'పూజారీ గ్రంథి సమ్మాన్ యోజన' పేరుతో పథకాన్ని ప్రవేశపెడతామని, దీని రిజిస్ట్రేషన్ మంగళవారం నుంచి ప్రారంభిస్తామని ఆప్ కన్వీనర్, మాజీ సిఎం కేజ్రీవాల్ ప్రకటించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వస్తే వృద్ధుల కోసం సంజీవని, మహిళల కోసం నెలకు రూ.2,100 అందించే మహిళా సమ్మాన్ యోజన స్కీంలను అమలు చేస్తామని ప్రకటించారు.

గాజాలో ఆస్పత్రులపై దాడులు ఆపండి

- డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ పిలుపు
- చలితో నెలరోజుల చిన్నారి మృతి
- ఇప్పటివరకు ఆరుగురు శిశువుల కన్నుమూత
- గత 24గంటల్లో 27మంది పాలస్తీనియన్ల మృతి



ఇజ్రాయిల్ దాడులకు ధ్వంసమైన గాజాలోని ఒక ఆసుపత్రి

జెనీవా : గాజాలో ఆస్పత్రులపై దాడులను ఆపాల్సిందిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ ఆడమ్ గెబ్రెయెసెస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. గత కొద్ది రోజులుగా ఒక దాని తర్వాత మరొకటి వరుసగా ఆస్పత్రులపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని సృష్టించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత వారంలో ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు దిగి, మెజారిటీ భాగాన్ని అగ్నికి ఆహుతి చేసింది. ఆస్పత్రులన్నీ కదన రంగాలుగా మారాయని, ఆరోగ్య వ్యవస్థ తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని గెబ్రెయెసెస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతమున్న తరుణంలో గాజా ప్రజలకు పూర్తి స్థాయిలో ఆరోగ్య సంరక్షణ వుండాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మానవతా సాయం కూడా అందించాల్సి వుందన్నారు. తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. డబ్ల్యుహెచ్‌ఓ, ఇతర భాగస్వాములతో కలిసి గాజా ప్రజలకు మౌలికంగా అవసరమైన వైద్య సరఫరాలు, ఆహారం, తాగు నీరు వంటివి సరఫరా చేస్తోందని, కానీ ఇజ్రాయిల తన దాడులతో వాటిని అడ్డం గొడుతోందని విమర్శించారు. కమల్ అద్వాన్ ఆస్పత్రిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్న డైరెక్టర్ హుస్సేన్ అబూ సఫియాను ఆర్మీ స్థావరంలో వుంచినట్లు మీడియా వార్తలు తెలిపాయి. మరోవైపు గాజాలో గత 24గంటల్లో 27మంది పాలస్తీనియన్లు మరణించగా, 149మంది గాయపడ్డారు. అత్యంత శీతల గాలులతో నెల రోజుల బాలుడు గాజాలోని అల్ అక్సా ఆస్పత్రిలో కన్నుమూసింది. ఇంతకు ముందు రోజే ఆ బాలుడి కవల సోదరుడు ఇదే కారణంతో చనిపోయాడని మీడియా వార్తలు తెలిపాయి. ఇప్పటివరకు చలి కారణంగా గాజాలో ఆరుగురు శిశువులు మరణించారు. ఒక వృద్ధుడు కూడా కన్నుమూశాడని అధికారులు తెలిపారు. మానవతా సాయం రవాణా చేస్తున్న ట్రక్కుల విషయంలో సరైన ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ప్రపంచ ఆహార కార్యక్రమాన్ని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం విమర్శించింది. ట్రక్కులకు సరైన ఎస్కార్టు వుండడం లేదని, వాటి గురించి సమాచారం కూడా అందుబాటులో వుండడం లేదని విమర్శించింది. ఇదంతా డబ్ల్యుఎఫ్‌పి నిర్వహణా వైఫల్యమని వ్యాఖ్యానించింది.

పోలీస్ స్టేషన్‌లో దళితుడి అనుమానాస్పద మృతి

- పోలీసులే హత్య చేశారు : బంధువులు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లా సత్వారా పోలీస్ స్టేషన్‌లో ఓ దళిత వ్యక్తి అనుమానాస్పదంగా మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. వ్యక్తి అత్యహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతుండగా, లేదు.. డిమాండ్ చేసిన లంచం ఇవ్వలేదని పోలీసులే హత్య చేశారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. బంధువులు వెల్లడించిన వివరాల కోసం ఓ మహిళ ఫిర్యాదు ఆధారంగా 35 ఏళ్ల ముఖేష్ లాంగ్రేను సత్వారా పోలీస్ స్టేషన్‌కు ఈ నెల 26న పిలిపించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కొద్ది సేపటికే ముఖేష్ మరణించాడు. స్టేట్‌మెంట్ నమోదు చేసుకోవడానికే పిలిచామని, కస్టడీలోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్ కిటికీకి స్కార్ఫ్‌తో ఆత్యహత్య చేసుకోవడాన్ని చూసి వెంటనే ఆసుపత్రికి తరలించామని, అక్కడ వైద్యులు ముఖేష్ మృతి చెందినట్లు ధ్రువీకరించారని పోలీసులు చెబుతున్నారు.

దారుణాలకు బిజెపి ప్రభుత్వానిదే బాధ్యత : కాంగ్రెస్

ఈ ఘటనకు మోహన్ యాదవ్ ప్రభుత్వానిదే బాధ్యతని, ప్రభుత్వ మద్దతు లేకుండా ఇలాంటి దారుణం సాధ్యం కాదని కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో ఒక దళిత యువకుడు పోలీసు కస్టడీలో హత్యకు గురయ్యాడు. ఒడిశాలోని బాలాసోర్‌లో గిరిజన మహిళలను చెట్లకు కట్టేసి కొట్టారు. ఈ రెండు సంఘటనలు విచారకరం, అవమానకరం, తీవ్రంగా ఖండించదగినవి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటనలు ఒకదాని తర్వాత ఒకటి జరుగుతున్నాయి ప్రభుత్వ మద్దతు లేకుండా ఇది సాధ్యం కాదు' అని రాహుల్ విమర్శించారు. ఈ ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని భీమ్ ఆర్మీ కార్మికులు డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ఆర్థిక పరిహారం ఇవ్వాలని కోరారు.

పక్షి దాడి ఓ సాకు మాత్రమే

- కొరియా విమాన ప్రమాదంపై నిపుణులు

సియోల్: దక్షిణ కొరియా గడ్డపై అత్యంత ఘోరమైన విమాన ప్రమాదానికి పక్షి దాడే కారణమని ప్రభుత్వం చెబుతున్నది సరికాదని నిపుణులు పేర్కొంటున్నారు. విమానం దిగేటప్పుడు ల్యాండింగ్ గేర్ వాడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని వారు చెబుతున్నారు, ట్విన్-ఇంజిన్ బోయింగ్ 737-800 మువాన్ విమానాశ్రయంలో బెల్లీ ల్యాండింగ్‌కు సంబంధించి సమాధానం లేని ప్రశ్నలు అనేకం ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. విమానం ల్యాండింగ్ అయ్యే సమయంలో రన్‌వే పై నుంచి పక్కకు మళ్లి రక్షణ గోడను ఢీకొనడంతో మంటలు చెలరేగి 179 మంది మరణించారు. విమానం ఎందుకు అంత వేగంగా వెళుతోంది? ఫ్లాప్‌లు ఎందుకు తెరవలేదు? ల్యాండింగ్ గేర్ ఎందుకు డౌన్ కాలేదు?" విమానయాన నిపుణుడు మరియు ఇటలీ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో మాజీ ఉపాధ్యాయుడు గ్రిగోరీ అలెగి అన్నారు.దక్షిణ కొరియా అధికారులు జెజు ఎయిర్ ఫ్లైట్ 72216 యొక్క క్రాష్‌ను పరిశీలిస్తున్నారు, ఇందులో సంభావ్య పక్షి సమ్మె ప్రభావం మరియు వాతావరణం ఉన్నాయి. విమానంలో ఉన్న 181 మందిలో 179 మంది మరణించారు. ఫ్లైట్ సేఫ్టీ నిపుణుడు మరియు లుఫ్తాన్స పైలట్ క్రిస్టియన్ బెకర్ట్ మాట్లాడుతూ, వీడియో ఫుటేజ్ రివర్సర్‌లను పక్కన పెడితే, చాలా వరకు విమానం బ్రేకింగ్ సిస్టమ్‌లు యాక్టివేట్ కాలేదని, "పెద్ద సమస్య" వేగంగా ల్యాండింగ్ కావడమేనని అన్నారు. ల్యాండింగ్ గేర్ పైకి ఉండగానే పక్షి కొట్టడం వల్ల అది దెబ్బతినే అవకాశం లేదని చెప్పాడు.

రూ.21వేల కోట్లు దాటిన రక్షణ ఎగుమతులు

మావు (మధ్యప్రదేశ్) : దశాబ్ద కాలంలో భారతదేశ రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.21 వేల కోట్లను దాటాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. దశాబ్ద కాలం క్రితం రూ.2వేల కోట్ల మేరకే ఎగుమతులు వుండేవన్నారు. 200ఏళ్ల నాటి మావు కంటోన్మెంట్‌లో ఆర్మీ వార్ కాలేజ్ (ఎడబ్ల్యుసి)లో అధికారులను ఉద్దేశించి సింగ్ సోమవారం ప్రసంగించారు. 2029నాటికి రూ.50వేల కోట్ల రక్షణ ఎగుమతులను సాధించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సైనికులను సన్నద్ధం చేయడంలో మిలటరీ శిక్షణా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. యుద్ధ రంగంలో కూడా సమూలమైన మార్పులు అనేకం చోటు చేసుకున్నాయన్నారు. సమాచార యుద్ధం, కృత్రిమ మేధస్సు ప్రాతిపదిక సాగే యుద్ధం, పరోక్ష యుద్ధాలు, ఎలక్ట్రో మాగ్నటిక్ యుద్ధం, రోదసీ యుద్ధం, సైబర్ దాడులు ఇలా సాంప్రదాయేతర పద్ధతుల్లో యుద్ధాలు చేయడం పెన సవాలుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు ఒప్పందాలపై సంతకాలు

స్కార్పియన్ తరహా జలాంతర్గాములకు సంబంధించిన రూ.2,867 కోట్ల విలువైన రెండు ఒప్పందాలపై రక్షణ శాఖ సోమవారం సంతకాలు చేసింది. డిఆర్‌డిఓ అభివృద్ధిపరిచిన ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ మాడ్యూల్ (ఎఐపి) నిర్మాణానికి సంబంధించిన ఒప్పందం ఒకటి కాగా, రెండోది ఎలక్ట్రానిక్ హెవీ వెయిట్ టార్పెడో (ఇహెచ్‌డబ్ల్యుటి)కి సంబంధించిన ఒప్పందం.

చరిత్రను వక్రీకరించే యత్నమిది

- షేక్ అబ్దుల్లా జయంతి, అమరుల దినం సెలవుల రద్దుపై సిపిఎం విమర్శ

శ్రీనగర్ : షేక్ మహ్మద్ అబ్దుల్లా జయంతి, అమరవీరుల దినోత్సవాలను సెలవు దినాలుగా రద్దు చేస్తూ జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం విమర్శించింది. ఈ నిర్ణయాన్ని చరిత్రను వక్రీకరించే యత్నంగా సిపిఎం నేత, కుల్గామ్ ఎమ్మెల్యే మహ్మద్ యూసుఫ్ తరిగామి విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమానికి, జమ్మూ కాశ్మీర్ ప్రజల సాధికారత కోసం షేక్ మహ్మద్ అబ్దుల్లా చేసిన సేవలను విస్మరించరాదని ఆయన పేర్కొన్నారు. మహిళల సాధికారత, అందరికీ విద్య, నష్టపరిహారం లేకుండా దున్నేవాడికే భూమి వంటి నిర్ణయాల ద్వారానే ప్రజలకు సాధికారత లభించిందని, ఇవన్నీ వారు సాగించిన ఉద్యమాల ద్వారానే వచ్చాయని తరిగామి పేర్కొన్నారు. అంతటి మహోన్నతుడిని ఇలా అప్రతిష్టపాల్జేయడమంటే చరిత్రను వక్రీకరించడమేనని ఆయన విమర్శించారు. 2025 కేలండర్ సంవత్సరంలో సెలవు దినాల జాబితా నుండి జులై 13, డిసెంబరు 5వ తేదీలను తొలగించడం చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జులై 13 అంటే జమ్మూ కాశ్మీర్‌కు చారిత్రక ప్రాధాన్యత చాలా వుందన్నారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తమ జీవితాలను అర్పించిన వారి త్యాగాలను గుర్తు చేసుకునే రోజు అది అని చెప్పారు. అలాగే డిసెంబరు 5 షేక్ సాహిబ్ జయంతి అని, అది కూడా గొప్ప ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. సమాజాన్ని ప్రజాస్వామ్యీకరించడం ద్వారా, నయా కాశ్మీర్ మేనిఫెస్టోలో భాగంగా సమూలంగా భూ సంస్కరణలను అమలు చేయడం, ఉచిత విద్యను ప్రవేశపెట్టడం, మహిళలకు సాధికారత కల్పించడం ద్వారా షేక్ సాహిబ్ ఆయన సహచరులు గొప్ప సేవలందించారని కొనియాడారు. అటువంటి కీలకమైన మైలు రాళ్ళను మన స్మృతిపథం నుండి చెరిపివేయడానికి చేసే యత్నాల వల్ల వారు ఏ విలువలకైతే ప్రాతినిధ్యం వహించారో ఆ విలువలు దెబ్బతింటాయన్నారు. ఇలా చరిత్రను వక్రీకరించడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఒనగూడవన్నారు. ప్రజలను మరింతగా చీల్చడానికే ఈ ప్రయత్నాలు పనికొస్తాయన్నారు. ఇటువంటి నిర్ణయాల ద్వారా జమ్మూ కాశ్మీర్ ప్రజలను ప్రభుత్వం అవమానపరుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఇటువంటి విచ్ఛిన్నకర ఎజెండాను సమైక్యంగా ప్రతిఘటించాల్సిందిగా జమ్ము కాశ్మీర్, లడఖ్ ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేస్తోందన్నారు.

మనుస్మృతి దహనం చేశారంటూ 13 మంది విద్యార్థుల అరెస్టు

- ఎటిఎస్ విచారణ

లక్నో : మనుస్మృతి దహనం చేశారనే ఆరోపణలతో వారణాసిలో బనారస్ హిందూ యూనివర్శిటీ (బిహెచ్‌యు)కి చెందిన 13 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు విద్యార్థినులు. వీరికి వారణాసి జిల్లా కోర్టు 14 రోజుల కస్టడీ విధించింది. మనుస్మృతి దహన్ దివస్ సందర్భంగా ఈ నెల 25న మనుస్మృతిని బిహెచ్‌యులో భగత్‌సింగ్ స్టూడెంట్స్ మోర్చా (బిఎస్‌ఎం)కు చెందిన విద్యార్థులు దగ్ధం చేశారు. 1927లో డిసెంబరు 25న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేసిన సందర్భంగా ఏటా అదే తేదీని 'మనుస్మృతి దహన్ దివస్'గా నిర్వహిస్తున్నారు. బిహెచ్‌యు భద్రతా అధికారి ఓం ప్రకాష్ తివారీ ఈ నెల 26న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా లంక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విద్యార్థులు అధ్యాపకులపై, భద్రతా సిబ్బందిపై దాడి చేశారని, ఇతర విద్యార్థులతో ఘర్షణకు దిగారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా బిఎన్ఎస్‌లోని తీవ్ర నిబంధనలు సెక్షన్ 132 (ప్రభుత్వ ఉద్యోగులను వారు విధుల నిర్వర్తించకుండా నిరోధించడం, దాడి చేయడం), సెక్షన్ 196(1) (మతం, జాతి, పుట్టిన ప్రాంతం, నివాసం, భాష మొదలైన వాటి ఆధారంగా ప్రజల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), సెక్షన్ 299 (మత విశ్వాసాలను అవమానించడం, మతపరమైన భావాలను రెచ్చగొట్టడం) వంటి వాటితో కేసు నమోదు చేశారు. ఇందులో కొన్ని సెక్షన్ల ప్రకారం కనీసం పదేళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ కేసులో ముఖేష్ కుమార్, సందీప్ జైస్వాల్, అమర్ శర్మ, అరవింద్ పాల్, అనుపమ్ కుమార్, లక్ష్మణ్ కుమార్, అవినాష్, అరవింద్, శుభం కుమార్, ఆదర్స్, ఇప్సితా అగర్వాల్, సిద్ధి తివారీ, కాత్యాయని బి రెడ్డిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వీరికి కస్టడీ విధించడంతో చౌకాఘాట్‌లోని జిల్లా జైలుకు తరలించారు. అక్కడ వీరిని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) బృందం విచారణ చేస్తోంది.

విద్యార్థుల అరెస్టులపై బిఎస్ఎం ఖండన

విద్యార్థుల అరెస్టును బిఎస్ఎం తీవ్రంగా ఖండించింది. బ్రాహ్మణీయ, హిందూత్వ శక్తుల ఆదేశంతో జరిగిన అణచివేత చర్యగా విమర్శించింది. యూనివర్శిటీ సిబ్బంది చేసిన కల్పిత ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని, వారి కుటుంబ సభ్యులకు అరెస్టు సమాచారం కూడా ఇవ్వలేదని, ఇది సుప్రీంకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది.

మహిళలకు ఉపాధి కల్పిస్తే మూతపడక తప్పదు

- ఎన్‌జిఓలకు తాలిబన్ల హెచ్చరిక

కాబూల్ : ఆఫ్గనిస్తాన్‌లో తాలిబన్ల అరాచకాలకు అంతు లేకుండా పోతోంది. ఇప్పటికే మహిళలపై అనేక రకాలైన ఆంక్షలు అమలు చేస్తూ వచ్చిన తాలిబన్ నాయకత్వం తాజాగా దేశంలోని స్వచ్ఛంద సంస్థలకు ఒక హెచ్చరిక జారీ చేసింది. మహిళలకు ఉపాధి కల్పించడం ఆపాలని లేదా ఆ సంస్థలను మూసుకోక తప్పదని హెచ్చరించింది. మహిళలకు ఉపాధి కల్పిస్తున్న దేశ, విదేశీ ప్రభుత్వేతర సంస్థలు, గ్రూపులన్నీ వెంటనే మూతపడతాయని పేర్కొంది. తలపై హిజాబ్, బురఖాలు సరిగా ధరించనందున ఆఫ్ఘన్ మహిళలకు ఉపాధి కల్పించడాన్ని ఆపేయాలంటూ రెండేళ్ళ క్రితమే ఎన్‌జిఓలను తాలిబన్లు ఆదేశించారు. ఈ మేరకు ఆర్థిక వ్యవహారాల శాఖ ఆదివారం రాత్రి ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టింది. తాజా ఆదేశాలను అమలు చేయని పక్షంలో ఇక ఆ ఎన్‌జిఓలకు దేశంలో పనిచేసేందుకు లైసెన్స్ కోల్పోతాయని హెచ్చరించింది

ఇళ్లకు కిటికీలు వద్దు

మహిళలు ఇళ్లల్లో పనిచేసుకుంటూ వుంటే బయటకు కనిపించరాదని, అలా కనిపించేందుకు ఆస్కారముండే కిటికీలను నిర్మించరాదని తాలిబన్ నేత ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. పాత ఇళ్లకు వుండే కిటికీలను శాశ్వతంగా మూసివేయాలని, కొత్త ఇళ్లలో అసలు కిటికీల నిర్మాణమే వద్దని తెలిపింది.

రిలయన్స్‌కు 5 లక్షల ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

ఎలక్ట్రోలైజర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కర్నూలు జిల్లా హోసూరు, పెద్ద హుల్తిలో 1,800 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. వైఎస్ఆర్ జిల్లా మైలవరం, కొండాపురం, నంద్యాల జిల్లాలో కొలిమిగుండ్లలో మొత్తం 1,080 ఎకరాల్లో క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ ప్రైవేటు లిమిటెడ్‌కు రూ.2 వేల కోట్లతో 119 మెగావాట్ల విండ్ పవర్, 130 మెగావాట్ల సోలార్ హైబ్రీడ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంటు ఏర్పాటుకు ఎస్ఐపిబిలో ఆమోదం తెలిపారు.

కేంద్రంపై రైతుల ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బంద్ కొనసాగించారు.

బంద్‌పై ముందు నుంచి విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన కూడా చోటుచేసుకోలేదు. అలాగే రహదారులపై వాహనాలు, రైళ్లను సైతం తిరగనివ్వబోమని ప్రకటించడంతో ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అత్యవసరాలు మాత్రం బంద్ నుంచి మినహాయించారు. ఈ బంద్‌కు వ్యాపారులు, ఉద్యోగ సంఘాలు, కార్మికులు, మాజీ సైనికులు, సర్పంచ్‌లతోపాటు వివిధ వర్గాల వారు మద్దతు ప్రకటించారు. బంద్‌కు సహకరించిన ప్రజలకు రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ ధన్యవాదాలు తెలిపారు. జనవరి 4న ఖనోరి నిరసన ప్రదేశంలో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించనున్నట్లు ఆందోళనకారులు ప్రకటించారు.

కొనసాగిన జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరాహార దీక్ష

70 ఏళ్ల రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. దల్లేవాల్ ఇప్పటి వరకు వైద్య చికిత్సను నిరాకరించారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు నిరాహార దీక్ష విరమించేది లేదని దల్లేవాల్ ప్రకటించారు. దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించడానికి ఒప్పించేందుకు సుప్రీంకోర్టు... పంజాబ్ ప్రభుత్వానికి డిసెంబర్ 31 వరకు గడువు ఇచ్చింది. అవసరమైతే కేంద్రం నుండి లాజిస్టికల్ మద్దతును కోరవచ్చని సుప్రీంకోర్టు సలహా ఇచ్చింది.

జిమ్మి కార్టర్ ఇక లేరు

- శాంతి కోసం కృషి చేసిన నేత
- పలువురు నేతల సంతాపం

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత జిమ్మి కార్టర్ ఆదిరవారం నాడు కన్ను మూశారు.ఆయన వయసు 100 సంవత్సరాలు. 2000 సంవత్సరంలో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. అమెరికా 39వ అధ్యక్షుడిగా 1977-81 మధ్య పనిచేశారు. కేన్సర్ నుంచి బయటపడిన ఆయన మొన్నటి అధ్యక్ష ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కువ కాలం బతికిన అమెరికా అధ్యక్షుల్లో జిమ్మీ కార్టర్ మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన మృతికి పలు దేశాధినేతలు సంతాపం తెలిపారు. ఇటీవలే వందవ పుట్టిన రోజు జరుపుకున్న కార్టర్ భారత్‌కు అత్యంత సన్నిహితుడు. రాజకీయాల నుండి వైదొలగిన తర్వాత కూడా మరింత శాంతియుతమైన విదేశాంగ విధానం కోసం కృషి చేసిన కార్టర్ మృతికి క్యూబా, వెనిజులా, చైనా తదితర దేశాల నుండి సంతాపాలు వెల్లువెత్తాయి. శాంతి కోసం కృషి చేసిన ఆయన ప్రపంచ రాజకీయాలపై చెరగని ముద్ర వేశారని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రశంసించారు. వెనిజులా ఎన్నికల వ్యవస్థ ప్రపంచంలోనే ఉత్తమమైనదని 2012లో కార్టర్ కొనియాడిన విషయాన్ని ఈ సందర్భంగా మదురో గుర్తు చేసుకున్నారు. క్యూబాతో మరింత మెరుగైన సంబంధాల కోసం కార్టర్ చేసిన కృషిని క్యూబా ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని క్యూబా అధ్యక్షుడు డియాజ్ కానెల్ వ్యాఖ్యానించారు. క్యూబన్ ఫైవ్ విడుదల కోసం జరిగిన ప్రచారానికి ఆయన బహిరంగంగా ఇచ్చిన మద్దతును గుర్తు చేశారు. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ తైవాన్‌ను చైనా భూభాగానికి చెందినదిగా గుర్తించడానికి కార్టర్ అంగీకరించడం అమెరికా-చైనా నిర్మాణాత్మక సంబంధాల్లో కీలకమైనదని వ్యాఖ్యానించారు. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడిని కూడా ఆయన బహిరంగంగానే వ్యతిరేకించారని అన్నారు. అమెరికా రోదసీ సంస్థ నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ ఘనంగా నివాళి అర్పిస్తూ వాయేజర్ 1పై కార్టర్ అన్న మాటలను గుర్తుకు తెచ్చుకున్నారు.



మీకోసం

వంటగదిలో ఉపయోగించే నాప్‌కిన్లకు పొరపాటున మంట అంటుకుంటే దానిపై ఉప్పు చల్లితే ఆరిపోతుంది.

జీవన సౌరభం


కాలం విలువను గ్రహించని వారు, జీవితం విలువను అర్థం చేసుకోలేరు.

తమాషా చూద్దాం

పిల్లలూ, రేపు కొత్త సంవత్సరం ప్రారంభం కదా! అంకెల్లో ఈ సంవత్సరం భలే గమ్మత్తు సంగతులను మనకు చెబుతోంది. అవేంటో చూద్దామా!



- 2025... 45కి వర్గమూలం
- రెండు వేర్వేరు అంకెల వర్గాల గుణకారానికి సమానం $9^2 \times 5^2 = 2025$
- మూడు వేర్వేరు అంకెల వర్గాల సంకలనానికి సమానం $40^2 + 20^2 + 5^2 = 2025$
- 1936 తరువాత వచ్చే మొదటి వర్గమూలం 2025
- 1 నుండి 9 అంకెల ఘనాల మొత్తం 2025
- $1^3+2^3+3^3+4^3+5^3+6^3+7^3+8^3+9^3 = 2025.$



తయారు చేసుకుందాం

పిల్లలూ, మీ కోసం ఓ లెక్కల మాస్టారు అరచేతిలో పట్టే 2025 క్యాలండెరుని తయారుచేశారు. ఓ పోస్టు కార్డు తీసుకుని మాస్టారు చేసినట్లు మీరు కూడా ట్రై చేయండి చూద్దాం.





నేను గీసిన బొమ్మ



కమరగిరి.సుదీక్ష,
2వ తరగతి,
ఎస్‌ఎస్‌వి విద్యానికేతన్, నెల్లూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వెలుగుల దారుల్లో నడుద్దాం..

ఇంకొన్ని గంటల్లో కొత్త సంవత్సరం ఆరంభమౌతోంది. ఈరోజంతా దానికి ఎలా ఆహ్వానం పలుకుదామా అని కొంతమంది తెగ ఆలోచిస్తుంటారు. పార్టీలు, డిన్నర్‌లు, టపాకాయలు, వెలుగులు జిమ్మే విద్యుత్కాంతులతో ఎలా సెలబ్రేట్ చేద్దామా! అని హడావిడి పడిపోతుంటారు. ఇంటి ముందు అందమైన రంగవల్లులు వేయాలని మహిళలు చాలా ఉత్సాహంగా ఉంటారు. టీవీలో ప్రోగ్రామ్‌లు చూడడంలో పెద్దలు బిజీ అయిపోతారు. ఇక కుర్రకారు, పిల్లలకైతే ఎవరి వెసులుబాటులు వాళ్లవి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే ఈ సందర్భంలో కొన్ని విషయాలు ఒకసారి ఆలోచిద్దాం..

కొత్త ఆలోచనలకి, కొత్త మార్పులకు నాంది పలకడంలో ప్రతి ఒక్కరూ ఎప్పుడూ ముందుండాలి. అయితే ఆ స్ఫూర్తి ఏడాది ప్రారంభం నుండి కాదు, ఏడాదంతా ఉండాలి. అందుకు తగ్గ ప్రణాళికలు వేసుకోవాలి. గతం నేర్పిన అనుభవాలతో భవిష్యత్తు దారులు వేసుకోవాలి.

ఈరోజుకి, రేపటికి తేడా లేకుండా జీవించడం వాస్తవం. ప్రతి రోజూ మనదే అన్నట్లు జీవించడం మన నైజం. భవిష్యత్తుపై ఆశ ప్రతి రోజూ ఉంటుంది. ఉండాలి కూడా! రోజులు గంటలుగా, గంటలు క్షణాలుగా గడిచిపోయేంత తీరిక లేని జీవితాలు జీవిస్తున్నాం. ప్రత్యేక రోజులు, పండుగలకు దుబారా ఖర్చులు చేసేంత స్థోమత లేని కుటుంబాలు మనవి. ఈ సందర్భంగా అమెరికాలో ఇటీవల నిర్వహించిన ఓ సర్వే గురించి తెలుసుకుందాం.

అమెరికాలో ఇలా అంటున్నారు..

ఇంగ్లీషు సంవత్సరాన్ని అత్యంత ఆర్భాటంగా జరుపుకునే అమెరికాలో ఈ ఏడాదికి ఎలా ప్రారంభం పలుకుతున్నారో చూద్దాం. ది అసోసియేటెడ్ ప్రెస్-ఎన్‌ఓఆర్‌సి(సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్) ఇటీవల నిర్వహించిన పోల్ ప్రకారం, యుఎస్‌లోని మెజారిటీ పెద్దలు తమ స్వంత ఇళ్లలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని భావిస్తున్నారు. దాదాపు 20 శాతం మంది స్నేహితులు, కుటుంబసభ్యులతో ఇంటి వద్దనే వేడుకలు నిర్వహించుకోవాలను కుంటున్నారు. 5 శాతం మంది మాత్రమే పార్టీలు, ఈవెంట్లు చేసుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారు. ఈ పోల్ ప్రకారం కొత్త ఏడాదిలో విశేషమైన మార్పులు వస్తాయని ఎవరూ ఆశించడం లేదు. ఒక 40 శాతం మంది మాత్రం ఆశావాద దృక్పథంతో ఉన్నారు. చాలామంది మాత్రం 2024, 2025 మధ్య పెద్ద వ్యత్యాసం ఉండదని నమ్ముతున్నారు. 'ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కాబట్టి ఈ సంవత్సరం పార్టీలకు మొగ్గు చూపే వారి సంఖ్య బాగా తగ్గిపోయింద'ని చికాగోలో ఒక ఈవెంట్ నిర్వాహకుడు చెప్పిన విషయాన్ని కూడా పోల్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. మన దేశంలో కూడా ఇంచుమించు ఇలానే ఉంటుందని కూడా ఈ సర్వేలో చెప్పారు. అయితే మనం ఇంకాస్త అప్రమత్తంగా ఉండాలని ఈ ఏడాది మనకి నేర్పించింది.



మూర్ఖపు ఆలోచనలకి స్వస్తి చెప్పాలి

చాలా కాలం నుండి మన చుట్టూ చాలా చెత్త పేరుకుపోతోంది. అది వ్యర్థాలతో నిండింది కాదు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య అంతరాలు పెంచుతున్న చెత్త అది. దేశాన్నంతటినీ ఒక్కతాటిపైకి తీసుకురావాలన్న 'జమిలి'సాకుతో వైషమ్యాలు సృష్టిస్తున్న ప్రయత్నాలు అవి. 'ఆంగ్ల సంవత్సరాన్ని మనం చేసుకోకూడదు. మనకి తెలుగు సంవత్సరాది ఉంది. అప్పుడే పండుగ చేసుకోవాలి' అని ఎప్పటి నుండో ఒక వాదన ఉన్నా, అది ఈమధ్య ఇంకాస్త పెరిగింది. అవకాశం ఉన్న ప్రతిచోటా ఈ మూర్ఖత్వాన్ని జనాల మెదళ్లల్లోకి జొప్పిస్తున్న మూక ఇప్పుడు కనిపిస్తోంది. ప్రతిజ్ఞలు, పలుకుబడిలతో ఒక గుంపు జనజీవన స్రవంతిలో అలజడి సృష్టిస్తోంది. ఈ కుప్పి గంతులకు, కుయుక్తలకు అడ్డుకట్ట వేయాలని ఈ సంవత్సరం తీర్మానించుకుందాం.

పాశ్చాత్య సంస్కృతి పేరుతో న్యూఇయర్ సెలబ్రేట్ వద్దంటున్న పెద్దలే యువతని పెడదోవే పట్టించే ఈవెంట్లు, పార్టీలు వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మద్యం ఏరులై పారించేందుకు దారులు తెరుస్తారు. బడా నాయకులు, బడా బాబులు ఈ జాబితాలో ఎప్పుడూ ముందుంటారు. వాస్తవాలు గ్రహించాల్సింది ప్రజలే.

మనమేమీ ఆదిమ కాలంలో జీవించడం లేదు. ఆకులు, అలములు కట్టుకునీ ఉండడం లేదు. తెలుగు సంవత్సరాలు, తిథులు, నక్షత్రాలతో రోజులు లెక్కబెట్టుకుంటుంటే ఇంకా మనం మన తాత, ముత్తాతల కాలంలోనే ఉంటాం. తేదీలు, వారాలు, నెలలతోనే సగటు మనిషి జీవనం గడుస్తోంది. జీతాలు, అద్దెలు, ఫీజులన్నీ ఆ వరుసలోనే ఉంటాయి. అయినా ఆదాయం, ఖర్చు బేరీజు వేసుకుని ఖర్చులు సర్దుబాటు చేసుకునే కుటుంబాలు ఇక్కడ చాలానే ఉన్నాయి. దుబారా ఖర్చులకు మొగ్గుచూపని పెద్దలు, ఆ పరిస్థితులను అర్థం చేసుకున్న పిల్లలు కూడా ఉన్నారు.

గతం ఎప్పుడూ ఎన్నో జీవితపాఠాలు నేర్పిస్తుంది. ఆ అనుభవాల నుండే భవిష్యత్తు లక్ష్యాలు వేసుకుంటాం. దురలవాట్లు మానాలని కొంతమంది నిర్ణయించుకుంటారు. కోపాన్ని తగ్గించుకోవాలని ఇంకొంతమంది అనుకుంటారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలనుకుంటారు చాలామంది. ఏ లక్ష్యమైనా వారి వారి అనుభవాల నుండి నేర్చుకున్న పాఠాలే. ఈ మధ్యలో తలదూర్చి, ప్రలోభాలకు గురిచేసి, మన గమ్యాలను తారుమారు చేయడం కొంతమంది పనిగా పెట్టుకున్నారు. తస్మాత్ జాగ్రత్త.

ఈర్ష్య, ద్వేషం, అసూయ కంటే మూఢత్వం పెద్ద రోగం. శరీరాన్ని దహించే వ్యాధులకు మందులు ఉంటాయి. కానీ మనిషిని, సమాజాన్ని నిలువునా నాశనం చేసే మూర్ఖత్వానికి ఏ మందూ లేదు. వాస్తవాలు గ్రహించి, చైతన్యంతో మెలగడమే మనముందున్న ఏకైక దారి.

చింతకాయ పులుపు, బెల్లం తీపి, వేపకాయ చేదు అన్నది ఎంత వాస్తవమో మూర్ఖపు ఆలోచనలు జీవితాలను ఛిద్రం చేస్తాయన్నది కూడా అంతే నిజం. మెదళ్లను తొలిచేస్తున్న ఈ చీడపురుగులను ఎంత తొందరగా వదిలించుకుంటే అంతమంచిది. వ్యసనమైనా అంతే. ఏడాది చివరి రోజున మనల్ని, మన కుటుంబాల్ని దహించివేస్తున్న ఆ ఆలోచనలకి స్వస్తి పలుకుదాం.

శాస్త్ర, సాంకేతికతలను అందిపుచ్చుకున్న నేటి యువత, విజ్ఞానంతో అడుగులు వేయాలి. వివేకంతో నడుచుకోవాలి. వ్యసనాలకి, ప్రలోభాలకి లొంగిపోకుండా వాస్తవాలని గ్రహించాలి. పరిస్థితులు అర్థం చేసుకుంటూ ప్రతి అడుగూ ముందుకు వేయాలి. ఆ అడుగుల దారి వెలుగు వైపు నడిపిస్తుంది. లేదంటే చుట్టూ చీకటి అలుముకుంటుంది. 'ఈ సంవత్సరం ఎలా నడుచుకున్నాం. మనం తీసుకున్న నిర్ణయాలు ముందుకు నడిపించేవా? వెనక్కి మళ్లించేవా? ఆ అనుభవాలతో కొత్త సంవత్సరం ఆచరించవలసింది ఏమిటి?' అనేదానిపై ప్రతి ఒక్కరికీ స్పష్టత ఉండాలి. ఆ స్పష్టతతో, తియ్యని వేడుకలతో ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని మనసారా స్వాగతం పలుకుదాం.

రంగవల్లి



16 చుక్కలు, 6 వరుసలు, 6 వచ్చేవరకు



పి. సాయిదీప్తి,
యశోదానగర్,
తిరుపతి.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సప్ : 83329 25496

'గోటితో పోయేదాన్ని...'

- సంధ్య థియేటర్ సంఘటనపై పవన్‌కల్యాణ్
- జనవరి నుంచి నెలలో 14 రోజులు జిల్లాల పర్యటనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'గోటితో పోయే దానిని గొడ్డలిదాకా తెచ్చుకున్నారు' అని సంధ్య థియేటర్ సంఘటనపై డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధులతో సోమవారం ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఆ సంఘటన దురదృష్టకరమని అన్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కుటుంబాన్ని పుష్ప సినిమా యూనిట్ పరామర్శించి క్షమాపణలు కోరి ఉంటే బాగుండేదని చెప్పారు. అలా చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. క్షమాపణ చెప్పడానికి అనేక విధానాలు ఉంటాయని, వీటిలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించిందని చెప్పారు. ఈ సమస్యలో హీరోను ఒక్కరినే ఒంటరిని చేశారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సినీపరిశ్రమతో గౌరవం, మర్యాదతో వ్యవహరించిందన్నారు. పుష్ప సినిమా విషయంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి చాలా ప్రోత్సాహం అందించారని, స్పెషల్ షోలు, టికెట్ రేట్స్ పెంచుకోవడానికి అనుమతిచ్చారన్నారు. చట్టం అందరికి ఒకేలా పనిచేస్తుందనే విధంగా రేవంత్‌రెడ్డి వ్యవహరించారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక నుండి నెలలో 14 రోజులు తన పేషీతోసహా తాను జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు. సమస్యలకు సత్వర పరిష్కారం, భిన్న పరిస్థితులపై అధ్యయనం చేస్తామ న్నారు. మొదటి ఆరు నెలల్లో పాలనపై పట్టు పెంచుకున్నామని గత ఐదేళ్లలో పట్టుతప్పిన కార్యనిర్వాహక వ్యవస్థను గాడిలో పెడుతున్నామ న్నారు. క్షేత్రస్థాయి పర్యటనల వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థను దిగజార్చా రని, గత ఐదేళ్లలో బ్యూరోక్రసీ అట్టడుగుకు దిగజారిం దని కేంద్రం నుంచి ఓ అధ్యయన నివేదిక వచ్చింద న్నారు. తప్పు జరుగుతున్నప్పుడు ఎందుకు మాట్లాడలేకపోయారని కలెక్టర్ల సదస్సులో అడిగితే ఎవరూ నోరు మెదపలేకపోయారన్నారు. అటవీశాఖ అధికారులపై ప్రజల్లో ప్రతికూలమైన అభిప్రాయం వ్యక్తమవుతోందని, నిజాయితీ గల అధికారుల పనితీరుతోనే అధిగమించాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో ఎర్రచందనం ఖాళీచేసేశారని చెప్పారు. జనసేనలో నాగబాబు తనతో సమానంగా పనిచేశారని, తొలుత అనకాపల్లి ఎంపి అభ్యర్థిగా, అనంతరం రాజ్యసభకు అనుకున్నామని అన్నారు. కూటమి పొత్తులో భాగంగా గెలిచే సీటును బిజెపికి వదులుకున్నామన్నారు. అందుకే నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తున్నామన్నారు.



పవన్ కల్యాణ్‌తో దిల్‌రాజు భేటీ

పవన్‌కల్యాణ్‌తో తెలంగాణా ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎఫ్‌సిసి) చైర్మన్ దిల్‌రాజు సోమవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో భేటీ అయ్యారు. రామ్‌చరణ్-శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'గేమ్ ఛేంజర్' మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఆంధ్రాలో నిర్వహించేందుకు అనుమతి నిమిత్తం దిల్‌రాజు వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కూడా పవన్‌కల్యాణ్‌ను దిల్‌రాజు కోరినట్లుగా తెలిసింది.

జనసేనలో జయమంగళ వెంకట రమణ చేరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆప్కో మాజీ చైర్మన్, వైసిపి నాయకులు గంజి చిరంజీవి, రాధ సోమవారం జనసేనలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్, ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎస్‌ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీని వాసరావు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు.

'బ్లాక్‌బస్టర్ పొంగల్' ఫుల్ సాంగ్ రిలీజ్



నటుడు వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన కొత్త సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం..'. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'బ్లాక్ బస్టర్ పొంగల్' ఫుల్ సాంగ్ విడుదలైంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'గోదారి గట్టుమీద', 'మీను' పాటలు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. 'బ్లాక్ బస్టర్ పొంగల్' పేరుతో మరో ఫుల్ లిరికల్ సాంగ్‌ను మేకర్లు విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, వెంకటేష్ ఆలపించారు.

కోరుకొండలో రేవ్ పార్టీ

- 18 మంది అరెస్ట్

ప్రజాశక్తి- కోరుకొండ (తూర్పుగోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న రేవ్ పార్టీపై పోలీసులు దాడి చేశారు. మొత్తం 18 మందిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. ఈ ఘటన కలకలం రేపింది. కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్ కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... గుజరాత్‌లోని పురుగుమందుల కంపెనీకి చెందిన ఏజెంట్ గోపాలకృష్ణ కొంతకాలంగా కోరుకొండ ప్రాంతంలో పని చేస్తున్నారు. తన కంపెనీ ప్రమోషన్ కోసం పురుగు మందుల డీలర్లకు పార్టీ ఇచ్చారు. ఎస్‌పి కార్యాలయానికి అందిన సమాచారం మేరకు ఎస్‌పి ఆదేశాలతో ఫంక్షన్ హాలుపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో కొంతమంది మద్యాన్ని సేవిస్తూ కనిపించారు. మరికొంతమంది మహిళలతో గదుల్లో ఉన్నట్లు గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, తణుకు, ఆచంట, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన పురుగు మందుల షాపుల డీలర్లు, కాకినాడ, రంపచోడవరం, ధవళేశ్వరానికి చెందిన ఐదుగురు మహిళలు ఈ పార్టీలో ఉన్నారు. రేవ్ పార్టీ నిర్వాహకుడు గోపాలకృష్ణ, పురుగుమందుల డీలర్లు, మహిళలు, సౌండ్ బాక్స్ నిర్వాహకునితోపాటు మొత్తం 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.61 వేల నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫంక్షన్ హాలు యజమాని కుమారుడు సత్తి రామిరెడ్డిపైనా కేసు నమోదు చేశామని, ఆయన పరారీలో ఉన్నారని సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అస్మక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీమిండియా బ్యాటర్ల వైఫల్యం

- భారత్ రెండో ఇన్నింగ్స్ 155ఆలౌట్
- బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆసీస్ గెలుపు

మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్ట్‌లో టీమిండియా ఓటమిపాలైంది. 340పరుగుల ఛేదనలో భాగంగా టీమిండియా 155పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్ జట్టు 184పరుగుల తేడాతో గెలిచింది. చివరిరోజు డ్రా కోసం భారత బ్యాటర్లు పోరాడినా ప్రయోజనం లేకపోయింది. జైస్వాల్(84), పంత్(30) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగా.. పంత్ ఔటయ్యాక టీమిండియా వరుసగా వికెట్లను కోల్పోయింది. 58ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 121పరుగులతో పటిష్ఠంగా ఉన్న భారత్.. ఆ తర్వాత వరుసగా వికెట్లను కోల్పోయి 79.1ఓవర్లలో ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 9వికెట్ల నష్టానికి 228పరుగులతో పరుగులతో సోమవారం చివరిరోజు ఆటను కొనసాగించిన ఆసీస్ జట్టు మరో ఆరు పరుగులు జోడించి లియాన్(41)వికెట్‌ను కోల్పోయింది. ఈ వికెట్‌ను పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా తీసుకున్నాడు. దీంతో టీమిండియా ముందు ఆస్ట్రేలియా 340పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా టాపార్డర్ బ్యాటర్లు రోహిత్(9), కెఎల్ రాహుల్(0), కోహ్లి(5) వికెట్లను కోల్పోయింది. 33 పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియాను జైస్వాల్, పంత్ ఆదుకున్నారు. వీరిద్దరూ ఆసీస్ పేసర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. ఓ వివాదాస్పద నిర్ణయంతో జైస్వాల్ పెవిలియన్‌కు చేరాడు. వాషింగ్టన్ సుందర్ (5నాటౌట్: 45బంతులు) క్రీజ్‌లో ఉన్నా.. అతడికి మద్దతు ఇచ్చే బ్యాటర్ కరువయ్యాడు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్‌కు ఐదు, స్కాట్ బోలాండ్‌కు మూడు, నాథన్ లయాన్‌కు రెండు.. స్టార్క్, హెడ్ చెరో వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు.. భారత్ 369 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 234 పరుగులకు ఆలౌటైంది. దీంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆసీస్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. చివరి టెస్ట్ సిడ్నీ వేదికగా జనవరి 3నుంచి ప్రారంభం కానుంది.



వివాదాస్పద నిర్ణయానికి ఔటవ్వడంతో అసహనంతో జైస్వాల్

మ్యాచ్‌ను వీక్షించిన 3.73 లక్షల మంది ప్రేక్షకులు

బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన ప్రేక్షకుల సంఖ్య కొత్త రికార్డు నమోదు చేసింది. అత్యధిక సంఖ్యలో ఈ టెస్టు మ్యాచ్‌ను ప్రేక్షకులు వీక్షించారు. సుమారు 3,73,691 మంది మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించినట్లు ఆస్ట్రేలియా క్రికెట్‌బోర్డు(సిఎ) ప్రకటించింది. ఇది రికార్డుగా నమోదైంది. మెల్‌బోర్న్ టెస్ట్‌కు ఇంత సంఖ్యలో ప్రేక్షకులు హాజరుకావడం ఇదే తొలిసారి. చివరిరోజైన సోమవారం అత్యధికంగా 74,362 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించారు. ఈ టెస్ట్ ప్రారంభం నుంచి ప్రతి రోజు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు హాజరయ్యారు. ఉత్కంఠభరితంగా సాగిన బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆస్ట్రేలియా 184పరుగుల తేడాతో గెలిచింది.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా : 474, 234

ఇండియా తొలి ఇన్నింగ్స్: 369

ఇండియా రెండో ఇన్నింగ్: జైస్వాల్ (సి)క్యారీ (బి)కమిన్స్ 84, రోహిత్ (సి)మార్ష్ (బి)కమిన్స్ 9, కెఎల్ రాహుల్ (సి)ఖవాజా (బి)కమిన్స్ 0, కోహ్లి (సి)ఖవాజా (బి)స్టార్క్ 5, పంత్ (సి)మార్ష్ (బి)హెడ్ 30, జడేజా (సి)క్యారీ (బి)బోలండ్ 2, నితీశ్ రెడ్డి (సి)స్మిత్ (లియాన్ 1, సుందర్ (నాటౌట్) 5, ఆర్ష్‌దీప్ (సి)హెడ్ (బి)బోలండ్ 7, బుమ్రా (సి)స్మిత్ (బి)బోలండ్ 0, సిరాజ్ (ఎల్‌బి)లియాన్ 0, అదనం 12. (79.1ఓవర్లలో ఆలౌట్) 155పరుగులు. **వికెట్ల పతనం:** 1/25, 2/25, 3/33, 4/121, 5/127, 6/130, 7/140, 8/150, 9/154, 10/155 **బౌలింగ్:** స్టార్క్ 16-8-25-1, కమిన్స్ 18-5-28-3, మార్ష్ 16-7-39-3, మార్ష్ 3-2-2-0, లియాన్ 20.1-6-37-2, హెడ్ 5-0-14-1, లబూషేన్ 1-1-0-0.

ఐసిసి టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ రేసులో బుమ్రా



దుబాయ్: 2024 ఏడాదికి గాను 'ఐసిసి టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' రేసులో టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా నిలిచాడు. ఐసిసి 20204 ఏడాదికి ఎంపిక చేసిన బౌలర్ల నామినేషన్‌లలో బుమ్రాకు చోటు దక్కింది. ఇంగ్లండ్ బ్యాటర్లు జోయ్ రూట్, హ్యారీ బ్రూక్.. శ్రీలంకకు చెందిన కామిందు మెండిస్‌లతోపాటు బుమ్రా కూడా ఐసిసి టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ రేసులో ఉన్నారు. బుమ్రా 2024లో 13టెస్టు మ్యాచ్‌లు ఆడి 14.92సగటు, 30.16 స్ట్రైక్ రేట్‌తో 71 వికెట్లు పడగొట్టాడు. దాంతో టెస్టు క్రికెట్ చరిత్రలో మరే బౌలర్ సాధించలేని ఘనత సాధించాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కూడా బుమ్రా అద్భుతంగా రాణిస్తున్నాడు. కేవలం 4 టెస్టు మ్యాచ్‌లలో 30 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. రూట్ 2024లో 17 టెస్టులు ఆడి 55.57 సగటుతో ఏకంగా 1,556 పరుగులు సాధించాడు. బ్రూక్ కూడా ఈ ఏడాది 12టెస్టుల్లో 1,100 పరుగులు చేసి నామినేషన్‌లలో చోటు సంపాదించాడు. బ్రూక్ 2024లో 317 పరుగులు ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ అని ఐసిసి ప్రశంసించింది.

టీమిండియాకు డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్ సంక్లిష్టం

నాలుగో టెస్ట్‌లో ఓడిన టీమిండియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ చేరిక సంక్లిష్టంగా మారింది. ఈ టెస్ట్‌కు ముందు ఫైనల్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నా.. ఆసీస్ చేతిలో 184పరుగులతో ఓటమి దెబ్బకొట్టింది. దీంతో సిడ్నీలో జరిగే ఐదో టెస్ట్‌లో టీమిండియా తప్పనిసరిగా విజయం సాధించాల్సిందే. భారత్ 55.26 పాయింట్లతో మూడో స్థానం ఉంది. ఆస్ట్రేలియా 61.46పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. శ్రీలంక పర్యటనలో ఆసీస్ ఓడితే సమీకరణలు మారనున్నాయి. ఆ సిరీస్‌ను ఆసీస్ డ్రాగా ముగిస్తే 56.48 పాయింట్లతో ఆస్ట్రేలియా ఫైనల్ చేరుకుంటుంది.

హసంతుల్లా డబుల్ సెంచరీ

ఆఫ్ఘనిస్తాన్-జింబాబ్వే తొలిటెస్ట్ డ్రా



బులవాయో: ఆఫ్ఘనిస్తాన్-జింబాబ్వే జట్ల మధ్య జరిగిన తొలి టెస్ట్ డ్రా అయ్యింది. చివరిరోజు ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ హసంతుల్లా షాహిది(246) రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. ఆఫ్ఘన్ బ్యాటర్ రామత్ షా 234పరుగులు(డబుల్ సెంచరీ) కొట్టి తొలుత రికార్డు కెక్కగా.. తాజాగా ఆ రికార్డు స్కోర్‌ను షాహిది బ్రేక్ చేశాడు. దీంతో ఆఫ్ఘన్ జట్టు తొలి ఇన్నింగ్స్ 699పరుగులకు తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 142పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హసంతుల్లా షాహిదీకి దక్కింది. రెండో, చివరి టెస్ట్ జనవరి 2నుంచి ప్రారంభం కానుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68